Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 242 విశాఖపట్నం, 11 జూలై 2024 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. పోలీస్ కమిషనర్ ఎస్. బాగ్చి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఇతర అధికారులతో కలిసి మెడ్ టెక్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పర్యటించారు. ఈ క్రమంలో మెట్ టెక్ జోన్ ప్రతినిధులు, ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించనున్న ప్రధాన మీటింగ్ హాలు, వర్చ్యువల్ విధానంలో జరిగే సీఐఐ సదస్సుకు సంబంధించిన హాలును పరిశీలించారు. అనంతరం పక్కనే ఉన్న టెస్లా హాలును పరిశీలించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెస్లా హాలులో సీఐఐ ప్రతినిధులు, ప్రముఖులతో ప్రత్యేకంగా భేటీ కానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

అనకాపల్లి జిల్లా పర్యటన అనంతరం హెలికాప్టర్ ద్వారా గురువారం మధ్యాహ్నం 1.50 గంటలకు మెడ్ టెక్ జోన్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ముఖ్యమంత్రి చేరుకోనున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. చుట్టూ బ్యారికేడ్లను

(మిగతా 2లో)

## వరాహావతారంలో శ్రీ జగన్నాథుడు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీక్షేత్ర స్వరూపుడు జగన్నాథ స్వామి బుధవారం వరాహవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. విశాఖ దక్షిణ నియోజక వర్గం పరిధి వన్ టౌన్ కొత్త రోడ్డులో ఉన్న దేవాదాయ శాఖకు చెందిన జగన్నాథ స్వామి దేవస్థానం వార్షిక రథయాత్ర మహోత్సవాల సందర్భంగా టర్నర్ చౌల్ట్రి వద్ద గల టర్నర్ సత్రం కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన దశావతారాలు పురస్కరించుకొని జగన్నాథ స్వామిని వరాహవతార రూపంలో సుందరంగా అలంకరించారు. ఉదయం స్వామికి మేలు కొలుపు, నాదస్వర వాయిద్యం, నిత్య పూజ, ఉభయ దాతల గోత్రనామాలతో పూజాధికములు నిర్వహించారు. తరువాత చిట్టెల సోమేశ్వర శర్మ అధర్వణ వేద పారాయణ చేశారు.

జగన్నాథ స్వామి ప్రార్థన గాన సంఘంచే ప్రార్థన తరంగిణి ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథుని అవతార రూపమైన వరాహవతారంను భక్తులు పూజలు నిర్వహించి, విశేష సంఖ్యలో దర్శించుకున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12.30 గంటలకు భక్తులకు దాతల సహాయంతో ఉచిత అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. దేవస్థానం అర్చకులు జగన్నాథాచార్యులు, రంగనాథాచార్యులు స్వామి వారికి పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా దేవస్థానం ఈవో టి. రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతిరోజు సాయంత్రం మూడు నుంచి రాత్రి 9 వరకు ఆధ్యాత్మిక, భక్తి రస సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల కోసం నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే, బుధవారం సాయంత్రం పలు రకాల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలంపై మంత్రి లోకేశ్ ఆగ్రహం



కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలం రేగింది. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి కలకలంపై సమగ్ర విచారణ జరపాలని అధికారులకు ఆదేశించారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ట్రిపుల్ ఐటీలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రి లోకేశ్ ను కలిశారు. తమ పిల్లలను చేర్పించి నష్టపోతున్నామంటూ వారు వాపోయారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్ మొత్తం గంజాయికి అడ్డాగా మారిందని తెలిపారు.

దీనిపై మంత్రి

(మిగతా 2లో)

## 41 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ.. మళ్లీ ఇప్పుడు మోదీ!

రష్యా పర్యటన ముగించుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ మాస్కో నుంచి ఆస్ట్రియా రాజధాని వియన్నా చేరుకున్నారు. తద్వారా 1983లో ఇందిరా గాంధీ పర్యటించిన 41 ఏళ్ల తర్వాత ఆస్ట్రియాలో పర్యటించిన రెండో ప్రధానిగా నిలిచారు.

ఎయిర్ పోర్టులో ఆయనకు ఆస్ట్రియా విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ స్కాల్లెన్ బర్గ్ తోపాటు ఆస్ట్రియాలో భారత రాయబారి శంభు కుమరన్ ఘన స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. వియన్నాలో అడుగుపెట్టినట్లు పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

దీనిపై ఆ దేశ చాన్స్ లర్ కార్ల్ నెహమ్మెర్ స్పందించారు. 'వియన్నా చేరుకున్న ప్రధాని మోదీకి స్వాగతం. ఆస్ట్రియాకు స్వాగతించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మన రాజకీయ, ఆర్థిక చర్చల కోసం ఎదురుచూస్తున్నా' అని నెహమ్మెర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అనంతరం మోదీ గౌరవార్థం హోటల్

(మిగతా 2లో)



## 46 ఏళ్ల తర్వాత తెరుచుకోనున్న పూరీ జగన్నాథుడి భాండాగారం!

- ఈ నెల 14న తెరవాలంటూ ప్రభుత్వానికి కమిటీ సిఫార్సు
- ఏకగ్రీవంగా తీర్మానించిన 16 మంది సభ్యుల కమిటీ
- తాళంచెవితో తెరుచుకోకుంటే పగలగొట్టనున్నట్లు వెల్లడి
- ఆభరణాల లెక్కింపుకు పలు మార్గదర్శకాలు



**భువనేశ్వర్, గోపాల్‌పూర్:** ఒడిశాలోని పూరీ శ్రీక్షేత్ర రత్న భాండాగారం ఓ అద్భుతమైన ఖజానా. జగన్నాథుని వెలకట్టలేని విలువైన ఆభరణాలను ఐదు కర్రపెట్టెల్లో ఉంచి, రహస్య గదిలో భద్రపరిచారు. పూర్వం అప్పుడప్పుడు దానిని తెరిచి సంపద లెక్కించేవారు. 1978 తర్వాత దానిని తెరవలేదు. దీంతో ఆ భాండాగారంపై వివాదాలెన్నో! అసలు తాళం ఏమైందనే అంశమే మొన్నటి ఎన్నికల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. చివరకు కొత్త ప్రభుత్వం దాన్ని తెరవాలని నిర్ణయించింది. సుమారు 46 ఏళ్ల తర్వాత ఈ నెల 14న తెరవనున్నారు. ఆభరణాల లెక్కింపుతో పాటు అవసరమైన వాటికి మరమ్మతులు చేపట్టనున్నారు. భాండాగారాన్ని తెరిచే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ బిశ్వనాథ్ రథ్ కమిటీ రెండో దఫా సమావేశం మంగళవారం పూరీలో జరిగింది. 14న భాండాగారం తెరిచేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కమిటీలోని 16 మంది సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం జస్టిస్ రథ్ విలేకరులతో మాట్లాడుతూ భాండాగారం తెరవడంతో పాటు సంపద లెక్కింపు, ఆభరణాల భద్రత, మరమ్మతులపై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వెల్లడించారు. రథయాత్ర పనిభారం వల్ల శ్రీక్షేత్ర పాలనాధికారి భాండాగారం డూప్లికేట్ తాళపుచెవిని కలెక్టరేట్ లోని ట్రెజరీ నుంచి తీసుకురాలేదని, ఆయన 14న తమకుఅందజేస్తారన్నారు. దాంతో తెరుచుకోకపోతే తాళంకప్ప పగలగొట్టి తలుపులు తెరవనున్నట్లు చెప్పారు.

**మాది పర్యవేక్షణ బాధ్యతే**

'జగన్నాథుడికి చెందిన వజ్ర, వైఢూర్యాలు, గోమేధిక, పుష్యరాగాలు, కెంపులు, రత్నాలు, స్వర్ణాభరణాలు, వెండి తదితరాల బరువు, నాణ్యత పరిశీలించడానికి నిపుణులు అవసరం. మా కమిటీ సభ్యులకు నగల నాణ్యతపై అవగాహన లేదు. మేం కేవలం పర్యవేక్షిస్తాం. భాండాగారానికి మరమ్మతులు చేయాల్సి ఉన్నందున నగల లెక్కింపు అక్కడే సాధ్యం కాదు. ఈ సంపదను మరోచోటికి తరలించి పటిష్ఠ భద్రత మధ్య లెక్కిస్తాం. మరమ్మతులపై అధ్యయనానికి మరో సంఘం అవసరమ'ని జస్టిస్ రథ్ వివరించారు. 'ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో లెక్కింపు చేపడతాం. ఇది ఎప్పుడు పూర్తవుతుందో నిర్దిష్టంగా చెప్పలేం. అప్పటి వరకూ సంఘం సభ్యులందరూ శాకాహారం భుజిస్తూ, నియమ నిష్ఠలతో ఉంటారు. స్వామివారి దర్శనాలకు భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ పాలకవర్గం, ప్రభుత్వం చర్యలు తీసుకుంటాయ'ని జస్టిస్ రథ్ పేర్కొన్నారు.

(మిగతా 2లో)

## మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై 18న తీర్పు



గుంటూరు: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్లపై ఈనెల 18న తీర్పు వెలువడనుంది. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రం వద్ద తెదేపా ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి, కారంపూడి సీఐ నారాయణ స్వామిపై దాడి కేసుల్లో పిన్నెల్లి అరెస్టయ్యారు. ప్రస్తుతం నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ రెండు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని పిన్నెల్లి మాచర్ల కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. న్యాయస్థానం బెయిల్ నిరాకరించింది.

దీంతో ఆయన గుంటూరు 4వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణకు రాగా.. పిన్నెల్లి తరఫున న్యాయవాదులు బెయిల్ కోసం వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశ్విని కుమార్ వాదనలు వినిపిస్తూ బెయిల్ ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. పిన్నెల్లి నేర చరిత్ర.. ఈ కేసులో మరికొంత మందిని అరెస్టు చేయాల్సి ఉన్నందున బెయిల్ ఇవ్వొద్దని కోరారు.

పిన్నెల్లి కొద్ది రోజులు పరారుకావటంపైనా కోర్టులో వాదనలు జరిగాయి. ప్రస్తుతం నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారని, పోలీసు విచారణకు ఏ మాత్రం సహకరించటం లేదన్న విషయాన్ని కూడా ప్రభుత్వ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. పోలీస్ కస్టడీ విచారణ వివరాల్ని కోర్టు ముందుంచారు. ఈ కేసుల్లో విచారణ ఇంకా జరగాల్సి ఉన్నందున ఈనెల 18కి తీర్పు వాయిదా వేస్తూ న్యాయమూర్తి శరత్ బాబు ఆదేశాలు జారీ చేశారు.

## నాణ్యమైన విద్యను అందించటానికే మెగా డీఎస్సీ : గంటా



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** సింహాచలం మహాత్మ జ్యోతిబా పూలే సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలోని వంటగది, భోజనశాలలో పరిస్థితులను చూశారు. విద్యార్థులకు వడ్డించే అన్నం, పప్పు, చారు, మజ్జిగ వంటి వంట పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచి బాగున్నా, మెనూలో పేర్కొన్న విధంగా పదార్థాలు పెట్టకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వంకాయ కూర మెనూలో రాసి, ఆనపకాయ వండడం లాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. వచ్చే నెలలో మరోసారి వస్తానని, నిర్వహణలో ఉన్న లోటుపాట్లను సరి చేసుకుని విద్యార్థులకు ఎలాంటి

(మిగతా 2లో)

## సీఎం చంద్రబాబు నాయుడుతో బిపీసీఎల్, విన్ ఫాస్ట్ కంపెనీ ప్రతినిధుల భేటీ

# రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చ

అమరావతి :- పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అత్యుత్తమ గమ్యస్థానం అని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. సచివాలయంలో బిపీసీఎల్, విన్ ఫాస్ట్ సంస్థల ప్రతినిధులతో బుధవారం సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించారు. రాష్ట్రంలో ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై బిపీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణకుమార్, సంస్థ ప్రతినిధులతో చర్చించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే దాదాపు రూ.60 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. చంద్రబాబు తన ఢిల్లీ పర్యటన సందర్భంలో కేంద్ర పెద్దలతో బీపీసీఎల్ పెట్టుబడులపై చర్చించారు. వాటికి కొనసాగింపుగా నేడు బిపీసీఎల్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 4-5 వేల ఎకరాలు అవసరం ఉంటుందని కంపెనీ ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అవసరమైన భూములు కేటాయిస్తామని...90 రోజుల్లో ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన పూర్తి ప్రణాళికతో రావాలని కంపెనీ ప్రతినిధులను ముఖ్యమంత్రి కోరారు. అక్టోబర్ నాటికి ఫీజబిలిటీ రిపోర్ట్ తో వస్తామని బిపీసీఎల్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం విన్ ఫాస్ట్ ప్రతినిధులతో చంద్రబాబు సమావేశం అయ్యారు. విన్ ఫాస్ట్ ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో వియత్నాంలో పెరున్న సంస్థ. ఈ సంస్థ సీఈవో పామ్ సాన్ చౌ తో పాటు సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం ఆ సంస్థ



(మిగతా 2లో)

# ఇఎస్ఐ హాస్పిటల్స్‌లో మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పించాలి : సిఐటియు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం ఇఎస్ఐ హాస్పిటల్ మరియు డిస్పెన్సరీలలో మెరుగైన వైద్య సేవలు కల్పించాలని కోరుతు ఈ రోజు ఇఎస్ఐ ఇన్స్పె క్షన్‌కు వచ్చిన కామన్ సపోట్ మిషన్ టీమ్ ఛైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్‌కి డా. అజిత్‌కి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు అర్.టి.రాజుల బృందం వినతి ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసిం గరావు మాట్లాడుతూ ఇఎస్ఐ బోర్డులో కార్మికుల డబ్బులు లక్షల కోట్లు రూ.లు వున్నా ఇఎస్ఐలో సౌకర్యాలు కల్పించడంలో బోర్డు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇఎస్ఐ హాస్పిటల్స్‌లో ఆపరేషన్ థియేటర్ మరియు లేబ్‌లో కనీస రక్త పరీక్షలు చేయడానికి అవసం ´మైన పరికరాలు కూడా లేవన్నారు. పేషంట్‌లకు అవసరమైన ఏ విధ మైన మందులు గానీ, ఇతర సామగ్రి గానీ అందుబాటులో లేవన్నారు. తక్షణమే ఇఎస్ఐ రోగులకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రిఫరల్ హాస్పిటల్స్ సంఖ్యను పెంచాలన్నారు. పేషెంట్‌లకు అవసరమైన బెడ్స్ సంఖ్యను పెంచాలన్నారు. వీటితో పాటు హాస్పిటల్స్ నందు అవసరమైన డాక్టర్లలను, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బందిని పెంచాలన్నారు. షీలా నగర్ వద్ద ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, బర్ను వార్డును ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఇఎస్ఐ హాస్పిటల్స్‌లో రోగులకు అవసరమైన ఆహారాన్ని సరఫరా చేసేందుకు వెంటనే క్యాంటిన్ ఏర్పాటు చేయాలన్నారు.

ఇఎస్ఐ వద్ద కార్మికుల డబ్బు లున్నా కార్మికులకు వైద్య సేవలం దించడంలో తీవ్ర నిర్లక్ష్యం ఇఎస్ఐ బోర్డు అవలంభిస్తుందన్నారు. కార్మికులకు మెరుగైన వైద్య సేవలు కల్పించాలని లేనిచో భవిష్యత్‌లో పెద్ద ఎత్తున కార్మికులతో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

దీనికి ఛైర్మన్ డా.కామత్ సింగ్ స్పందిస్తూ ఇఎస్ఐలో ప్రస్తుత మున్న విభాగాల్లో పరిశీలించి అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకొని రేపు విజయవాడలో ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

# నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

## రోజు రోజుకు పెరిగిపోతున్న ప్రపంచ జనాభా

ప్రపంచ వ్యాప్తంగా జనాభా రోజురోజుకు పెరిగిపోతోంది. ముఖ్యంగా ఇండియా, చైనా లాంటి దేశాలకు ఇది కొన్ని ప్రయోజనాలు, కొన్ని నష్టాలను కలిగిస్తోంది. అధిక యువ శక్తితో ఇలాంటి దేశాలు అభివృద్ధిలో దూసుకుపోయేందుకు అవకాశాలు ఉన్నా.. అదే అధిక జనాభా ఈ దేశాలకు భారంగా కూడా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా జనాభా ప్రతియేటా పెరుగుతూనే ఉంది. అందుకే జనాభా పెరుగుదల, దాని పరిణామాలపై అవగాహన కలిగించేందుకు ప్రత్యేకించి ఓ రోజును కేటాయించారు. జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుతున్నారు. 1989లో ఐక్య రాజ్యసమితి ఈ రోజును ప్రారంభించింది.

1987 జూలై 11 నాటికి ప్రంపచ జనాభా 500 కోట్లకు చేరింది. అందువల్లే ఆ రోజును ప్రపంచ జనాభా దినోత్సవంగా జరుపుతున్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 35 శాతానికి పైగా జనాభా.. ఇండియా, చైనాలోనే ఉన్నారు. ఎప్పుడో 1850లో ప్రపంచ జనాభా 100 కోట్లను దాటింది. 2020 మార్చి నాటికి 780 కోట్లను దాటినట్లు అంచనా. వచ్చే 30 ఏళ్లలో 900 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 2050 నాటికి 970 కోట్లు, 2055 నాటికి 1000 కోట్లకు చేరుతుందనే అంచనా ఉంది.

**దేశంలో కరోనా కారణంగా చేపట్టని జనగణన**

మన దేశంలో కరోనా మహమ్మారి కారణంగా తాజాగా జనగణన చేపట్టలేదు. 2011 లెక్కల ప్రకారం భారతదేశం జనాభా 1,21,05,69,573. ప్రస్తుతం 135 నుంచి 140 కోట్ల దాకా ఉంటుందని అంచనా అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే 2020 జూలై 9 నాటికి భారత జనాభా 1,38,02,70,828 కోట్లుగా ఐక్యరాజ్యసమితి అంచనా




వేసింది. 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం మంది ఇండియా, చైనా, అమెరికా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ సహా 9 దేశాల్లో ఉంటారని అంచనా ఉంది.

**జనాభా పెరిగే కొద్దీ భూమికి భారమే..**

ప్రపంచ జనాభా పెరిగే కొద్దీ భూమికి భారమేనని నిపుణులు చెబుతున్నారు. కాలుష్యం నానాటికీ పెరిగిపోతోంది. అడవులు అంతరించిపోతున్నాయి. నదుల ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటోంది. మానవుల అత్యాశ కారణంగా భూమికి అంతా నష్టమే జరుగుతోంది. ప్రపంచ దేశాల మధ్య ఆధిపత్య పోరు పెరుగుతోంది. ఆహార కొరత తీవ్రంగా ఏర్పడుతోంది. ఆకలి చావులు తీవ్రమవుతున్నాయి. వ్యవసాయంలో యంత్రాలు, పురుగు మందుల వాడకం రోజురోజుకు పెరిగిపోతోంది. సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు రోజూ వేల టన్నులు పెరిగిపోతున్నాయి. ఇలా జనాభా పెరుగుదల వల్ల ఎన్నో నష్టాలు తప్పడం లేదు.

**భారత్‌లో యువ జనాభా ఎక్కువే..**

కాగా, భారత్‌ల యువ జనాభా ఎక్కువే. తద్వారా భారత్ త్వరగా అభివృద్ధి చెందేందుకు వీలవుతుంది. 2025 నాటికి జనాభాలో భారత్, చైనాను దాటేస్తుందని అంచనా వేస్తున్నారు. ఇండియాలో జనాభా నియంత్రణ అమలు కచ్చితంగా లేకపోవడమే ఇందుకు కారణం. నిజానికి ప్రపంచంలో కుటుంబ నియంత్రణ పథకాలను అధికారికంగా ప్రవేశపెట్టింది భారత్‌లోనే. 1950లోనే కోట్లు ఖర్చు చేసింది. కానీ ఫలితాలు కనిపించలేదు. ఇప్పటికైనా కుటుంబ నియంత్రణా చర్యలు కఠినంగా పాటించకపోతే ఇండియాలో తీవ్రమైన కరవు పరిస్థితులు రావచ్చనే నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**అభివృద్ధి దేశాల్లో మరణాల సంఖ్య తగ్గముఖం**

జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మరణాల సంఖ్య భారీగా తగ్గముఖం పట్టినట్లు గుర్తించారు.వైద్య రంగంలో అక్కడ వచ్చే అధునాతన మార్పుల వల్ల మరణాలు తగ్గి.. జనాభా సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇది ఆ దేశాలకు భారంగా మారుతోంది. జపాన్‌లో ముసలివారి సంఖ్య బాగా పెరిగిపోయింది. ప్రస్తుతం భూమిపై 40 కోట్ల మందికి ఆహారం దొరకడం లేదు. ఆఫ్రికా లాంటి దేశాల్లో ఆకలికి తోడు.. మురికి వాడల్లో రకరకాల వ్యాధులు వస్తున్నాయి.

**అవగాహన కల్పించాలి**

ఒక వైపు కుటుంబ నియంత్రణ పాటిస్తూ, మరో వైపు యువతను అభివృద్ధి వైపు మళ్లించాల్సిన అవసరం ఉంది. జనాభా విషయంలో అవగాహన కల్పించాలి. జనాభా పెరిగితే ఎలాంటి నష్టాలు ఉంటాయో యువతకు అవగాహన కల్పించాలి.

## (మొదటి పేజీ తరువాయిలు)

### ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఏర్పాటు చేయాలని, సమీప ప్రాంతంలో వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పించాలని అధికారులకు చెప్పారు. యుద్ధప్రాతిపదికన పారిశుధ్య చర్యలు చేపట్టాలని, హెలి ప్యాడ్ సమీపంలోని కంచె తుప్పలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెలి ప్యాడ్ నుంచి నేరుగా మెడ్ టెక్ జోన్ ప్రధాన స్థావరానికి ముఖ్యమంత్రి రోడ్డు మార్గం ద్వారా చేరుకుంటారు. కలాం కన్వెన్షన్ సెంటర్ కేంద్రంగా పలు కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతారు. టెస్లా హాలులో సీఐఐ ప్రతినిధులు, ఇతర ప్రముఖులతో ప్రత్యేకంగా భేటీ అవుతారు. అనంతరం పక్కనే ఉన్న ఒమేగా మీటింగ్ హాలులో మెడ్ టెక్ జోన్ ప్రతినిధులు, ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించి వారితో నేరుగా మాట్లాడతారు. తరువాత మెడ్ టెక్ జోన్ పరిధిలో కలాం కన్వెన్షన్ సెంటర్కు వంద మీటర్ల సమీపంలో ఉన్న వైద్య పరికరాల తయారీకి సంబంధించిన రెండు కంపెనీ భవనాలను ప్రారంభిస్తారు. ఈ క్రమంలో ప్రధాన కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను సీపీ, ఇతర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పలు అంశాలపై సమీక్షించి మార్గదర్శకాలు జారీ చేశారు. అందరూ సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం అక్కడ నుంచి బయలు దేరి ఎయిర్ పోర్టు ఎగ్జిక్యూటివ్ లాంజ్ వద్ద జరగనున్న సమీక్షా సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

జాయింట్ పోలీస్ కమిషనర్ కె. ఫక్కీరప్ప, డీసీపీ ఎం. సత్తిబాబు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, మెడ్ టెక్ జోన్ ప్రతినిధులు, సీఐఐ ప్రతినిధులు, ఇతర జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలంపై మంత్రి లోకేశ్ ఆగ్రహం

నారా లోకేశ్ స్పందిస్తూ... విద్యాలయాల్లో గంజాయి ఆనవాళ్లు లేకుండా నిర్మూలిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. గంజాయి నిర్మూలనకు ఇప్పటికే ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందని అన్నారు. ట్రిపుల్ ఐటీలో సమస్యను పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడతానని భరోసా ఇచ్చారు.

### 41 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ.. మళ్లీ ఇప్పుడు మోదీ!

రిట్జ్ -కార్ల్ టన్ లో ఏర్పాటు చేసిన ప్రైవేటు విందులో నెహమ్మెర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీతో కలిసి దిగిన ఫొటోను నెటిజన్లతో పంచుకున్నారు. మరోవైపు హోటల్‌లోకి అడుగుపెట్టిన ప్రధాని మోదీకి ఆస్ట్రియా కళాకారులు, వయొలిన్ విద్వాంసులు వందేమాతరం గేయం ఆలపిస్తూ స్వాగతం పలికారు.

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, భౌగోళిక, రాజకీయ సవాళ్లపై మరింత మెరుగైన సహకారం దిశగా ఆస్ట్రియాతో మోదీ చర్చలు జరపనున్నారు. ఆస్ట్రియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్ డర్ బెల్లెన్ తోపాటు ఆ దేశ చాన్స్ లర్ కార్ల్ నెహమ్మెర్ తో ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. అలాగే ఇరు దేశాలకు చెందిన వ్యాపారవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

ఆస్ట్రియా పర్యటనకు బయలుదేరే ముందు మోదీ మాట్లాడుతూ 'ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్టపాలన విషయంలో భారత్-ఆస్ట్రియా ఒకే రకమైన విలువలను కలిగి ఉన్నాయి. ఆ పునాదులపై ఇరు దేశాలు మరింత సన్నిహిత భాగస్వామ్యాన్ని నిర్మించనున్నాయి' అని పేర్కొన్నారు.

అంతకుముందు మోదీ పర్యటనను స్వాగతిస్తూ ఆస్ట్రియా చాన్స్ లర్ నెహమ్మెర్ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రధాని నరేంద్ర మోదీతో భేటీకి ఎదురుచూస్తున్నా. ఈ పర్యటన ఎంతో ప్రత్యేకమైనది. 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని తొలిసారి మా దేశానికి రానున్నారు. భారత్ తో దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సంబరాల వేళ మోదీ పర్యటన కీలక మైలురాయిగా నిలవనుంది' అని నెహమ్మెర్ పేర్కొన్నారు.

### 46 ఏళ్ల తర్వాత తెరుచుకోనున్న పూరీ జగన్నాథుడి భాండాగారం!

**1978లో చివరిసారి తెరిచిన భాండాగారం**

పూరీ జగన్నాథుని ఆభరణాలను ఐదు కర్రపెట్టెల్లో ఉంచి, రహస్య గదిలో భద్రపరిచారు. పూర్వం మూడేళ్లు లేదా ఐదేళ్లకోసారి ఈ గది తలుపులు తెరిచి సంపద లెక్కించేవారు. చివరిసారిగా 1978లో లెక్కించగా, 70 రోజులు పట్టింది. అప్పట్లో కొన్నింటిని వదిలేయడంతో లెక్కలపై సందేహాలున్నాయి. ఈ నేపథ్యంలో హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం భాండాగారం తెరిచి సంపద లెక్కించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు కూడా దీన్ని సమర్థించింది. రహస్య గదులు జీర్ణావస్థకు చేరి, వర్షపు నీరు లీకై గోడలు బీటలు వారుతున్నందున మరమ్మతులు చేయాలని కోర్టులు 2018లోనే పురావస్తు శాఖను ఆదేశించాయి. 2019 ఏప్రిల్ 6న నాటి నవీన్ పట్నాయక్ సర్కారు నియమించిన 13 మందితో కూడిన అధ్యయన సంఘం తలుపులు తెరవడానికి వెళ్లగా, రహస్య గది తాళపుచెవి కనిపించలేదు. దీంతో సభ్యులు వెనుదిరిగారు. తర్వాత మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యయనానికి ప్రభుత్వం జస్టిస్ రఘువీర్‌దాస్ కమిటీని నియమించింది. ఇంతలో డూప్లికేట్ తాళపుచెవి పూరీ కలెక్టరేట్ ట్రెజరీలో ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు రఘువీర్ కమిటీ నివేదికను ప్రభుత్వం వెల్లడించలేదు. దీన్ని ఇటీవలి ఎన్నికల్లో భాజపా ప్రచారాస్త్రంగా చేసుకుంది. తాము అధికారంలోకి వస్తే భాండాగారం తెరిపిస్తామన్న హామీకి కట్టుబడి, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన 16 మందితో కమిటీ వేసింది. భాండాగారం లోపల ఎలా ఉందో ఎవరికీ అవగాహన లేదు. 46 ఏళ్లుగా అందులోకి ఎవరూ వెళ్లలేదు.

### నాణ్యమైన విద్యను అందించటానికే మెగా డీఎస్సీ : గంటా

ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. తగినంత మంది ఉపాధ్యాయులు లేకుండా నాణ్యమైన విద్యను ఎలా ఆశించగలం? అందుకే 16 వేలకు పైగా పోస్టులలో నిర్వహించనున్న మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి సంతకం చేశారు.

విద్యలో ఆంధ్రపదేశ్ ను దేశంలోనే నెంబర్ వన్ గా నిలుపుతాం. వెనకబడిన తరగతుల వారి అభ్యున్నతి కోసం స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రారంభించిన గురుకుల విద్యాలయాలు అత్యద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయి. రాష్ట్రంలోని ఈ తరహా 106 విద్యాలయాల్లో 40 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అధ్వాన్న స్థితిలో ఉన్న ఈ విద్యాలయానికి 2014-19 మధ్య మానవవనరుల శాఖ మంత్రిగా 25 కోట్లు మంజూరు చేసి, సౌకర్యాలను మెరుగుపరిచాం.

అధికారంలోకి వచ్చిన గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసింది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన భవన నిర్మాణాలను పూర్తి చేయకపోవడం దారుణం. పెండింగ్‌లో ఉన్న వంట సరకులు సరఫరా చేసిన కాంట్రాక్టర్ కు బిల్లులు మంజూరు చేయించడానికి కృషి చేస్తా. ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఇతర విద్యార్థులకు ప్రేరణ గా నిలుస్తున్నారు. రెండు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న సింహాచలం పంచగ్రామల భూ సమస్యను రేపు విశాఖలో జరగబోయే సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తాం. అమరావతికి సమాంతరంగా విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిక్కాల విజయ్ బాబు, కోరాడ రాజబాబు, స్థానిక వార్డు సభ్యుడు పి.వి.నరసింహం, పార్టీ వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం చంద్రబాబు నాయుడుతో బిపీసీఎల్, విన్ ఫాస్ట్ కంపెనీ ప్రతినిధుల భేటీ

ప్రతినిధులకు వివరించారు. ఈవీ, బ్యాటరీ తయారీ ప్లాంట్ ను ఏపీలో నెలకొల్పాలని చంద్రబాబు వారిని కోరారు. ప్లాంట్ కు అవసరమైన భూమి, ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున అన్ని విధాలా సహకరిస్తామని...పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా కోరారు. అంతకు ముందు బిపీసీఎల్, విన్ ఫాస్ట్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి విందు ఇచ్చారు.

పంచాంగం

గురువారం 11-07-2024
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాయణం, గ్రీష్మరుతువు
ఆషాఢ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. పంచమి ఉ. 08.02 త. షష్ఠి |
| నక్షత్రం | : పుబ్బ ప. 12.18 |
| వర్జ్యం | : రా. 08.17 ల 10.03 |

### భారత్-చైనా సరిహద్దులో 108 కిలోల బంగారం పట్టివేత

లద్దాఖ్: భారత్- చైనా సరిహద్దులో అక్రమంగా రవాణా చేస్తున్న 108 కిలోల బంగారాన్ని భద్రతాదళం స్వాధీనం చేసుకొంది. ముగ్గురు వ్యక్తులను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటన తూర్పు లద్దాఖ్‌లో చోటు చేసుకొంది.

జులై 9న తూర్పు లద్దాఖ్‌లో ఇండో- టిబెటన్ బార్డర్ పోలీసు (ఐటీబీపీ) బలగాలు గస్తీ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే స్మగ్లింగ్ గురించి సమాచారం అందడంతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించారు. సోదాలు చేయగా 108 కిలోల బంగారు కడ్డీలతో పాటు రెండు మొబైల్ ఫోన్లు, బైనాక్యులర్, రెండు కత్తులు, చైనాకు చెందిన కొన్ని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐటీబీపీ వెల్లడించింది. ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపింది.

ఇందులో ఇద్దరు లద్దాఖ్‌లోని న్యోమా ప్రాంతానికి చెందినవారిగా భద్రతా దళాలు గుర్తించాయి. ఆ ప్రాంతంలో ఇంత భారీ మొత్తంలో బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి.

### ఆందోళనకు దారితీసిన బాలుడి మృతి

**ఆరిలోవ:** ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓ బాలుడు మృతితో ఈ పరిస్థితి తలెత్తింది. దీనికి సంబంధించి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన నిఖిల్ వెంకటసాయి(17)కు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి ఉండటంతో చికిత్స నిమిత్తం అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. సుమారు రూ. 10 లక్షలు ఖర్చవుతుందని ఆసుపత్రి వర్గాలు తెలపగా రూ. 3లక్షలు అడ్వాన్సుగా చెల్లించారు. బీమా డబ్బులు రూ.7 లక్షలు కూడా ఆసుపత్రికి జమ అయ్యాయి. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం బాలుడు మృతిచెందాడు. ఆసుపత్రి యాజమాన్యం రూ. 5 లక్షలు చెల్లించి మృతదేహం తీసుకెళ్లాలని తెలిపింది. అయితే ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు చనిపోయాడని బంధువులు ఆందోళనకు దిగారు. తాము రూ. 5 లక్షలు చెల్లించలేమని తేల్చి చెప్పారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. గొడవ పెద్దది కాకుండా చూశారు. మృతుడి బంధువులకు మద్దతుగా స్థానిక తెదేపా నాయకులు ఆసుపత్రికి వచ్చి ఆందోళనలో పాలుపంచుకున్నారు. విషయం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. దీంతో బాలుడి మృతదేహం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### కూర్మావతారంలో జగన్నాథుడు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** జగన్నాథ స్వామి కల్యాణ రథోత్సవాల్లో భాగం గా స్వామి వారు బుధవారం కూర్మావతారం లో భక్తులకు దర్శన మిచ్చారు. స్థానిక ఇంద్రద్యుమ్న మందిరం లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సహిత జగన్నాథ స్వామి వారి ఆలయం లో ఆలయ ట్రస్టీ రొంపిచర్ల సింగరాచార్యులు ఆధ్వర్యంలో అవతారపురుషుడైన స్వామి వారిని అర్చకులు రొంపిచర్ల కృష్ణమాచార్యులు కూర్మావతారం లో సర్వాంగ సుందరం గా అలంకరించి ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం లో కూర్మావతార వైశిష్ట్యం పై ఆలయ ట్రస్టీ, ప్రధానార్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు ఆధ్యాత్మిక ప్రసంగం చేసారు.



### ఎరువుల దుకాణం తనిఖీ

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక తగరపువలస లో గల ఎరువుల దుకాణం ను వ్యవసాయ, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు బుధవారం తనిఖీ చేసారు. తనిఖీ లో పాల్గొన్న రంపచోడవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సిహెచ్ కె వి చౌదరి, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ విశాఖ సి ఐ ఆర్ రవిప్రసాద్ ఎరువుల దుకాణం లో బయోస్టిములెంట్స్ కి సంబంధించిన జి-2, జి -3 పత్రాలను, నిల్వ ఉంచిన అమ్మకానికి సిద్ధం చేసిన ఎరువుల నాణ్యత పరిమణాలను పరశీలన చేసారు.అనంతరం గోదాములో గల నిల్వలను, బిల్ పుస్తకాలను, లైసెన్స్ లను తనిఖీ చేసారు. ఈ సందర్భం అధికారులు లైసెన్స్ కాపీ బోర్డు ను గోడకు వేలాడదీయాలనీ,వ్యవసాయ శాఖ సూచనలు,నిబంధనలు, చట్టాల మేరకు రిజిస్టర్ లను, బిల్ పుస్తకాలను అమలు చేయాలని, అలాగే విత్తనాలు, పురుగుమందుల వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా సంబంధిత కంపెనీ లనుండి ఫారం ఓ, సర్టిఫికేట్లను తీసుకోవాలని లేకపోతే లైసెన్స్ లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో వ్యవసాయ శాఖ అధికారిణి శివకోమలి, వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారి పి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ సమాచారమ్

గురువారం 11-07-2024


## ఆశీర్వాదం...

ఆశీర్వచనం ఎందుకు చేస్తారు... ఆశీర్వచనానికీ, అక్షతలకీ ఏమిటి సంబంధం... పసుపుతో కలిపిన బియ్యమే ఎందుకు చల్లాలి.

హిందూ సనాతన సంస్కృతిలో ఆశీర్వచనానికి చాలా విలువ వుంది. అనేక సందర్భాలలో చిన్న వారిని పెద్దవారు ఆశీర్వదిస్తారు.

విద్యార్థులను విద్యా ప్రాప్తిరస్తు అని, పెళ్ళయిన ఆడవారిని దీర్ఘ సుమంగళీభవ అని, పురుషులని దీర్ఘాయుష్మాన్ భవ అని... అలా... సమయానికి తగ్గట్లు వుంటాయి... ఆ దీవెనలు.

యజ్ఞయాగాదులు చేసేటప్పుడు, వేదోక్తంగా జరిగే కార్యక్రమాలలో అక్కడ పండితులు "గో బ్రాహ్మణో శుభంభవతు, లోకాస్సమస్త సుఖినోభవంతు" అనే ఆశీర్వచనంతో దేశంలో రాజు న్యాయంగా, ధర్మంగా పరిపాలించాలనీ, దేశం సుభిక్షంగా వుండాలనీ, గోవులు, బ్రాహ్మణులు, ప్రజలందరూ సుఖంగా వుండాలనీ, దేశంలో సకాలంలో వర్షాలు కురిసి దేశం సుభిక్షంగా వుండాలనీ, పిల్లలు లేనివారికి పిల్లలు కలగాలనీ, వున్నవారికి వంశాభివృద్ధి చేసే మనవలు కలగాలనీ, ధనం లేని వారికి సంపదలు కలగాలనీ, వగైరా సమాజంలో అందరి శ్రేయస్సు కోరుతూ ఆశీర్వచనం చేస్తారు.

అయితే ఈ ఆశీర్వచనాలకి ప్రభావం వుందా... అవి ఫలిస్తాయా... తప్పకుండా ఫలిస్తాయి..

సత్పథంలో నడిచే వారికి సత్పురుషులు చేసిన ఆశీర్వచనాలు తప్పక ఫలిస్తాయి. ఈ ఆశీర్వచనాల వల్ల జాతకంలో వుండే దోషాలు తొలుగుతాయి, అకాల మృత్యు దోషాలు తొలుగుతాయి. అంతేకాదు, పూర్వ జన్మ పాపాలు కూడా నాశనమవుతాయంటారు.

గురువులు, సిద్ధులు, యోగులు, వేద పండితులు, మనకన్నా చిన్నవారైనా వారి కాళ్ళకి నమస్కరించి వారి ఆశీర్వచనం తీసుకోవచ్చు. అక్కడ మనం నమస్కరించేది వారి వయసుకి కాదు, వారి విద్వత్తుకు, వారిలోని సరస్వతికి.

**అక్షతల సంకేతం.**

సాధారణంగా శిశువు జన్మించినప్పుడు పురిటి స్నానం రోజునుంచీ ప్రతి శుభసందర్భం లోనూ ఆశీర్వదించినప్పుడు తలమీద అక్షింతలు జల్లుతారు.

ఆశీర్వచనానికీ, అక్షింతలకీ ఏమిటి సంబంధం.

అక్షింతలే ఎందుకు చల్లాలి వేరే ధాన్యాలు వున్నాయికదా వాటిని చల్లవచ్చుకదా.

మరి పసుపుతో కలిపిన బియ్యమే ఎందుకు చల్లాలి.

బియ్యం చంద్రుడికి కారకం. చంద్రుడు మనస్సుకి కారకుడు. అంటే మనస్ఫూర్తిగా ఇచ్చే ఆశీర్వచనానికి చిహ్నమన్నమాట.

బియ్యంలో కలిపే పసుపు గురువుకి కారకం. గురువు శుభ గ్రహం. ఆయనకి సంకేతంగా, శుభానికి సంకేతంగా పసుపు రంగు కలిపిన అక్షింతలను మంత్రపూర్వకంగా తలమీద చల్లుతారు.

మంత్రం అంటే క్షయం లేనటువంటిది. అకారంనుంచి క్షకారం దాకా వున్న అక్షరాలతో, బీజాక్షరాలతో కూడిన మంత్రానికి శక్తి వుంటుంది. మంత్రాన్ని చదివేటప్పుడి చేతితో పట్టుకున్న అక్షింతలకి కూడా ఆ శక్తి వస్తుంది. క్షయంలేని మంత్రాలను, క్షయంలేని అక్షింతలు పట్టుకుని చదివి, అవి ఎవరి తలపై వేస్తారో వారుకూడా క్షయం లేకుండా అభివృద్ధి చెందాలని ఆశీర్వదిస్తారు. అలాంటి ఆశీర్వచనానికి శక్తి వుంటుంది.

మన పూజలు, శుభ సందర్భాల్లో అక్షింతలకు ఏంతో ప్రాధాన్యత ఉంది. అక్షింతల్ని సంస్కృతంలో అక్షతలు అంటారు. ఏ పూజ చేసినా దేవుని వద్ద అక్షింతలు ఉంచి మధ్యమధ్యలో "అక్షతాన్ సమర్పయామి" అంటూ భక్తిగా అక్షతలు జల్లడం హిందూ సంప్రదాయం. పెళ్ళిళ్ళు, పేరంటాలలో వధూవరులపై అక్షతలు జల్లి ఆశీర్వదిస్తారు. ఉయ్యాల, పుట్టినరోజు లాంటి అనేక వేడుకల్లోనూ అక్షింతలు తలపై జల్లి ఆశీర్వచనాలు పలుకుతారు.

మంత్రించిన అక్షతలు తలపై జల్లి ఆశీర్వదించి నట్లయితే, శుభం చేకూరుతుందని, చెడు ఫలితాలు, దోషాలు అంటకుండా ఉంటాయని పెద్దలు చెప్తారు. కేవలం పెళ్ళిళ్ళు, శుభకార్యాల్లోనే కాదు, అశుభ కార్యాల్లో కూడా అక్షతలు ఉపయోగించే సంప్రదాయం ఉంది.

బియ్యంలో తగినంత పసుపు, చిటికెడు కుంకుమ, తడిచీ తడవనట్లు కొన్ని నీళ్ళు, నాలుగు చుక్కలు నూనె వేసి అక్షతలను తయారుచేస్తారు. ఒకవేళ మంత్రించిన పసుపు లేదా కుంకుమలను వేసి తయారుచేసినట్లయితే ఆ అక్షతలు మరీ పవిత్రమైనవి.

## ఆలయాలకు కొత్త పాలకమండళ్లు : మంత్రి ఆనం



**అమరావతి:** రాష్ట్రంలోని ఎనిమిది ప్రధాన దేవాలయాల్లో సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలపై సమీక్ష చేస్తున్నట్లు ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు. విజయ వాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారిని కుటుంబసమేతంగా ఆయన దర్శించుకున్నారు. ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. త్వరలోనే అన్ని ఆలయాలకు కొత్త పాలకమండళ్లు ఏర్పాటు చేయ నున్నట్లు చెప్పారు.

"ప్రభుత్వం మారిన తర్వాత అప్పటి వరకు కొనసాగిన పాలకమండళ్ల సభ్యులు తమ పదవీకాలంతో సంబంధం లేకుండా రాజీనామాలు చేయడం నైతిక విలువలు పాటించడం అవుతుంది. లేని పక్షంలో ప్రభుత్వమే తగిన చర్యలు తీసుకుంటుంది. త్వరలోనే సీఎం చంద్రబాబు దేవాదాయశాఖపై సమీక్ష చేస్తారు. ఆయన సూచనల మేరకు ముందడుగు వేస్తాం. కొత్త పాలకమండళ్లను నియమిస్తాం. హిందూ ధర్మంలో ప్రతి ఒక్కరినీ గౌరవించడం మన సంప్రదాయం. ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం తగిన చర్యలు తీసుకుంటున్నాం"అని తెలిపారు.

## ప్రొబేషనరీ ఐఏఎస్ కోరికలు

పుణె: అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడంతో ఒక ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారి బదిలీ అయ్యారు. ప్రత్యేక వసతులు అందించాలని ఆమె డిమాండ్ చేయడంతో వివాదాల్లో చిక్కుకున్నారు. దాంతో ఆమెపై మహారాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణెలో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ పూజా ఖేద్కర్ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండానే తన ప్రైవేట్ ఆడి కారుకు రెడ్-బ్లూ బీకన్ లైట్లు, వీఐపీ నంబర్ ప్లేట్ ఏర్పాటుచేసుకున్నారు. అంతేకాక కారుకు మహారాష్ట్ర ప్రభుత్వం అనే స్టిక్కర్ సైతం అమర్చారు. వీటితోపాటు తనకు వసతి సౌకర్యాలు కల్పించాలని, తగినంత సిబ్బంది, కానిస్టేబుల్‌తో ఓ అధికారిక ఛాంబర్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

అంతటితో ఆగకుండా అదనపు కలెక్టర్ అజయ్ మోర్ లేని సమయంలో ముందస్తు అనుమతి తీసుకోకుండా ఆయన ఛాంబర్‌లో తన నేమ్‌ప్లేట్ పెట్టుకొని దాన్ని తన ఛాంబర్‌గా వినియోగించుకొన్నారు. అక్కడ ఉన్న కుర్చీలు, సోఫాలు, టేబుల్‌లతో సహా అన్ని మెటీరియల్‌లను కూడా తొలగించారు. తన పేరు మీద లెటర్ హెడ్, విజిటింగ్ కార్డ్, పేపర్ వెయిట్, నేమ్‌ప్లేట్, రాజముద్ర, ఇంటర్‌కామ్ అందించాలని రెవెన్యూ అసిస్టెంట్‌ను ఆదేశించారు. రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అయిన పూజా ఖేద్కర్ తండ్రి కూడా తన కుమార్తె డిమాండ్‌లను నెరవేర్చాలని కలెక్టర్ కార్యాలయ అధికారులను ఒత్తిడి చేశారు. లేదంటే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అయితే ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రొబేషన్‌లో ఉన్న ట్రైనీ ఐఏఎస్ అధికారులకు వీఐపీ ట్రీట్‌మెంట్, పైన పేర్కొన్న అదనపు సౌకర్యాలేవీ ఉండవు. ఐఏఎస్‌లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలంటే వారు గెజిటెడ్ అధికారులై ఉండాలి. ఈ విషయాన్ని పుణె కలెక్టర్ డాక్టర్ సుహాస్ దివాసే చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లడంతో పూజా ఖేద్కర్‌ను పుణె నుంచి వాషిమ్‌కు బదిలీ చేశారు. ఆమె తన ప్రొబేషన్ కాలం పూర్తయ్యే వరకు వాషిమ్ జిల్లాలో సూపర్ న్యూమరరీ అసిస్టెంట్ కలెక్టర్‌గా వ్యవహరిస్తారని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ UPSCలో 841 ర్యాంక్ సాధించారు. కాగా ఈ ఘటనపై ఆర్‌టీఐ కార్యకర్త స్పందిస్తూ పలు సందేహాలు లేవనెత్తారు. "పూజా ఖేద్కర్ ఓబీసీ నాన్ క్రిమిలేయర్ కోటాలో ఐఏఎస్ అధికారిగా సెలక్ట్ అయ్యారు. ఆమె తండ్రికి రూ.40 కోట్ల ఆస్తులు ఉన్నాయి. రూ.కోట్లలో ఆస్తులు ఉన్నవారు నాన్-క్రిమిలేయర్ కిందకు ఎలా వస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. ఆమెకు పలు మానసిక సమస్యలు ఉన్నాయని, ఉద్యోగంలో చేరే సమయంలో మెడికల్ టెస్ట్‌లకు కూడా హాజరుకాలేదని ఆరోపించారు. ఇవన్నీ దాటుకొని ఆమె ఎలా ఐఏఎస్ అధికారి అయ్యారనేది ఓ ప్రశ్నగా మిగిలిపోయిందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం

కొత్తగూడెం: ప్రభుత్వ ఉద్యోగాలు, పదోన్నతులు ఇప్పిస్తామంటూ ఘరానా మోసానికి పాల్పడిన ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు దాసు హరికిషన్, భార్య హారికను మంగళవారం అరెస్టు చేసి, పెద్ద మొత్తంలో నగదు రికవరీ చేసినట్టు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. కొత్తగూడెంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

హైదరాబాద్‌లో స్థిరపడ్డ వరంగల్ జిల్లాకు చెందిన దాసు హరికిషన్ ఆధ్వర్యంలో మొత్తం 13 మంది సభ్యులు ఓ ముఠాగా ఏర్పడ్డారు. కొత్తగూడెం కేంద్రంగా చేసుకుని సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్, క్లర్క్, డిపెండెంట్ కొలువులు, గ్రూప్-2 ఉద్యోగాలు, ప్రమోషన్లు ఇప్పిస్తామంటూ 2018 సంవత్సరం నుంచి మోసాలకు పాల్పడుతున్నారు. వారి మాటలు నమ్మి కొత్తగూడెం, వరంగల్, మంచిర్యాల, శ్రీరాంపూర్, బెల్లంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన 60 మంది మోసపోయారు. వారి నుంచి ఏకంగా రూ.4.08 కోట్ల వసూళ్లకు పాల్పడ్డారు. దీనిపై భద్రాద్రి జిల్లావ్యాప్తంగా ఆయా పోలీసుస్టేషన్లలో 32 మంది బాధితుల ఫిర్యాదుమేరకు కేసులు పెట్టారు. విచారణ చేపట్టిన పోలీసులు ఇప్పటి వరకు 10 మందిని అరెస్టుచేశారు. ప్రధాన నిందితుడు హరికిషన్‌ను గతంలోనే అరెస్టుచేశారు. మిగిలిన నిందితులైన గుండా వినోద్‌కుమార్, దాసు హర్ష, భీమవరపు శ్రీనివాస్, బొల్లపల్లి శ్రీనివాసాచారి, బోగాది నాగరాజు, చామర్తి సంజయ్, చామర్తి రమ్య, గుండా రవివర్మను అదుపులోకి తీసుకుని రిమాండ్ విధించారు. రూహత్ బేగ్, ఉపేంద్రనాయుడు, రవిరాజ్ పరారీలో ఉన్నారు. హరికిషన్ భార్య హారిక నుంచి రూ.1,47,14,000 నగదు, 4 తులాల బంగారం, ఓ రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ వివరించారు. నిరుద్యోగులను మోసం చేసి వసూలు చేసిన డబ్బులతో కొనుగోలు చేసిన 92.50 తులాల బంగారు ఆభరణాలను బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు పేర్కొన్నారు. వాటిని సత్వరం రికవరీ చేసేందుకు యత్నిస్తామన్నారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసేవారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహ్మాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ప్రవీణ్ పాల్గొన్నారు.

## జీవీఎంసీ కమిషనర్ బదిలీ - కలెక్టర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు

మహా విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ) కమిషనర్ సాయికాంత్‌వర్మను ప్రభుత్వం బదిలీ చేసింది. ఏపీ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీగా ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. జీవీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ బాధ్యతలను కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ప్రభుత్వం అప్పగించింది. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సాయికాంత్‌వర్మ... కడప నుంచి 2023 ఏప్రిల్‌లో జీవీఎంసీ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిననాటి నుంచి వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ వచ్చారు. వైకాపా నాయకుల ఆదేశాలను తప్పకుండా పాటించారనే విమర్శలు వెల్లువెత్తాయి. తెదేపా కూటమి అధికారంలోకి వస్తే కమిషనర్ నిర్ణయాలపై విచారణ సాగిస్తారనే ప్రచారం కూడా సాగింది. అయితే... కొందరు తెదేపా పెద్దలను ప్రసన్నం చేసుకున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ప్లాస్టిక్ నియంత్రణ, అనధికార నిర్మాణాల తొలగింపునకు బృందాల ఏర్పాటు, మెకానికల్ విభాగం పర్యవేక్షణకు విశ్రాంత ఆర్టీసీ అధికారిని నియమించడం, కనీస అర్హతలు లేనివారిని అందలం ఎక్కించడం వంటి చర్యలపై విమర్శలు వచ్చాయి.

నలుగురు కమిషనర్లు తిరస్కరించిన సీబీసీఎన్‌సీ నిర్మాణాలకు ప్లాను మంజూరు చేయడం, సిరిపురంలో టైకూన్ కడలి వద్ద సిమెంటు దిమ్మెలు పెట్టి రహదారి మూసివేయడం వంటి నిర్ణయాలు చర్చనీయాంశమయ్యాయి. టెండర్లు లేకుండా పలు పనులు అప్పగించారు. పాలకవర్గం దృష్టిలో లేకుండా హార్స్ రైడింగ్ ప్రాజెక్టు, రూ.4కోట్లతో పార్కు నిర్మాణం వంటివి సాగాయి. వైకాపా నేతలు బక్కన్నపాలెంలో ఎప్పుడో కోల్పోయిన భూములకు రూ.208 కోట్ల టీడీఆర్ జారీకి అడుగులు పడ్డాయి. ఎన్‌సీసీ నిర్మాణాలకు డీమ్డ్ ప్లాను అప్రూవల్ వంటి చర్యలతో జీవీఎంసీకి అపారనష్టం కలిగేలా వ్యవహరించారు. ఇటీవల ఓట్ల లెక్కింపునకు ముందు నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని భోగాపురం ప్రాంతంలో కారులో తిప్పినట్లు ప్రతిపక్ష నేతలు ఆరోపించారు.

## గత ప్రభుత్వంలో ఈ శాఖ ఉందని కూడా ఎవరికీ తెలియదు: మంత్రి అచ్చెన్నాయుడు



ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు నేడు మత్స్యశాఖపై సమీక్ష సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మత్స్య శాఖ పరిస్థితి చూస్తుంటే చాలా బాధ కలుగుతోందని అన్నారు. గత ప్రభుత్వంలో మత్స్యశాఖ ఉందన్న విషయం కూడా ఎవరికీ తెలియదని వ్యాఖ్యానించారు.

వైసీపీ సర్కారు హయాంలో ఐదు హార్బర్లకు టెండర్లు పిలిచి సొంతవారికే కట్టబెట్టారని, రెండోసారి నాలుగు హార్బర్లను వైసీపీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఇచ్చారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. మత్స్యకారులకు డీజిల్ రాయితీ రూ.10 కోట్ల బకాయి ఉందని వెల్లడించారు. డీజిల్ సబ్సిడీ బకాయిలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

మత్స్యకార భృతిపై సర్వే చేసి 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులకు నిర్దేశించినట్టు వివరించారు. మత్స్య పరిశ్రమ ఎగుమతుల వృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని, ఎగుమతులకు ఉన్న అన్ని అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించినట్టు అచ్చెన్నాయుడు వెల్లడించారు.

## ఎమ్మెల్యే కొణతాలను కలిసిన పి ఆర్ టి యు నాయకులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పీ ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం నాయకులు డి గోపినాథ్, బుద్ధ కాశీ విశ్వేశ్వరారావు , కాంద్రేగుల జనార్ధనరావు తదితరులు స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియచేసారు, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో.117ను వెనక్కి తీసుకోవాలని, ఉపాధ్యాయులకు రావలిసిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, పిఆర్సి లో భాగంగా ఐ ఆర్ ను ప్రకటించాలాని, ఉపాధ్యాయులపై ఏపీపీ ల భారం తగ్గించేటట్టుగా కృషి చేయాలనీ కోరారు

## "అసమానతలు అరికట్టాలి"

భారతీయులందరూ ఋషుల సంతతే. పూర్వం మతాలు లేవు. కులాలు అసలే లేవు. తారతమ్యాలు అంతకన్నా లేవు. వృత్తులను బట్టి కులాలను ఆపాదించారు.

ఇవన్నీ గతంలోని బ్రిటిష్, ఇతర పాలకులు సృష్టించినవే అని గమనించాలి. గత గతిని మార్చాలి. విభజనలను ఆపాలి. కులం, మతం ప్రసక్తి లేని సమాజ నిర్మాణానికి పూనుకోవాలి.

కులం, మతం ప్రమేయం లేకుండా ఆర్థిక ప్రాతిపదికన వ్యక్తులను పరిగణలోకి తీసుకొని ఉపాధి అవకాశాలు కల్పించాలి.

నేటి పాలకులు వీటిపై దృష్టి సారించి అసమానతలకు అడ్డుకట్ట వేయాలి. బీజేపీ అధికారంలోకి వచ్చాక 'నమో' కొన్ని అసమానతలపై కీలక నిర్ణయాలు తీసుకోవడం హర్షనీయమే.

కేంద్ర మంత్రి వర్గంలో రాజ్యాంగంలో పొందు పరచిన ప్రాతిపదికన చోటు కల్పిస్తారు.

మంచిదే, కానీ రాష్ట్రల కొచ్చేసరికి ప్రాంతీయ పార్టీలు సామాజిక వర్గాల ప్రాతిపదికన సీట్లు కేటాయించడం అలాగే మంత్రి వర్గం లో చోటు కల్పించడం, కొన్ని సామాజిక వర్గాలను పూర్తిగా విస్మరించడం సముచితమా! పరిపాలనకు దక్షత ప్రాధాన్యం. విద్యావంతులను పరిగణలోకి తీసుకోవాలి.

వయస్సు పై బడిన వారికి విశ్రాంతి ఇవ్వాలి. అవకాశం అన్నది 5/10 సం:లు మించ కూడదు. ఒక సారి ఎమ్మెల్యే/ఎంపీ ఐనంత మాత్రాన వారికి జీవిత కాలం పెన్షన్ ఇత్యాది బత్యాలు అందచేయకూడదు.

అప్పుడే నూతన యువ రక్తం రాజకీయాలకు వచ్చి సంస్కరణలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంటుంది.

డబుల్ ఇంజన్ సర్కార్ కొంత వరకూ ఆహ్వానించ దగ్గదే.



ఏది ఏమైనా ప్రభుత్వాలు అలోచించి అడుగులు వేయాలి.

అందరి అభిప్రాయాలూ పరిగణలోకి తీసుకోవాలి. అప్పుడే అసమానతలు తొలగి ప్రజా స్వామ్యం ఫరిడవిల్లుతుంది.

డా. నండూరి రామక్రిష్ణ

## నిర్లక్ష్యంగా కారు నడిపిన కేసులో రెండేళ్ల జైలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నిర్లక్ష్యంగా కారు నడిపి ఒకరి మృతికి కారణమైన నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎం.ప్రదీప్‌కుమార్ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో నిందితుడు మరో రెండు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని ఆదేశించారు. న్యాయస్థానం సీనియర్ సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపిల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పెదవాల్తేరు ప్రాంతానికి చెందిన తమిలిసెట్టి సురేంద్రరెడ్డి (28) చినగదిలిలోని అపోలో హాస్పిటల్‌లో ఉద్యోగం చేసేవారు. 2019 మార్చి 5న మధ్యాహ్నం 3 గంటలకు విధులు ముగించుకొని వస్తూ దారిలో రోడ్డు పక్కన మూత్రవిసర్జన చేస్తున్నారు. ఆ సమయంలో ఆరిలోవ బృందావన్‌కాలనీకి చెందిన రాగోలు ప్రశాంత్‌కుమార్ అతివేగంతో కారును నడుపుతూ వచ్చి సురేంద్రరెడ్డిని బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు ప్రశాంత్‌కుమార్‌ను న్యాయస్థానంలో హాజరు పరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

# కొలెస్ట్రాల్ పెరిగిపోతోందా..



కొలెస్ట్రాల్ ఎంత ప్రమాదకరమైనదైనా ప్రకృతిలో లభించే పదార్థాలతో సులభంగానే నియంత్రించ వచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఒక్క కొలెస్ట్రాల్ నియంత్రించ గలిగితే సగం సమస్యలకు చెక్ పెట్టినట్టే. ప్రకృతిలో విరివిగా లభించే కొన్ని సీడ్స్ ఇందుకు అద్భుతంగా ఉపయోగపడతాయి.

కొలెస్ట్రాల్ అనేది రక్తంలో పేరుకుపోయే కొవ్వు లాంటి పదార్థం. మన ఆహారపు అలవాట్ల వల్లే ఇది పేరుకుపోతుంటుంది. రక్తంలో కొలెస్ట్రాల్ ఉండటం వల్ల మధుమేహం, రక్తపోటు, గుండెపోటు వంటి ప్రమాదకర వ్యాధులు చుట్టుముడుతుంటాయి. అందుకే కొలెస్ట్రాల్‌ను నిర్మూలిస్తే అన్ని వ్యాధులు దూరమౌతాయి. కొలెస్ట్రాల్ సమస్యను నిర్మూలించేందుకు కొన్ని సీడ్స్ ఉపయోగపడతాయి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దాంతోపాటు మోనో అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్, పోలీ అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్, విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. సీడ్స్ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ చాలా సులభంగా తగ్గుతుంది. ఫైబర్ అధికంగా ఉండే పదార్థాలతో కొలెస్ట్రాల్ నిర్మూలన సాధ్యమౌతుంది.

సాధారణంగా మనం తరచూ తినే కొన్ని పండ్ల విత్తనాలే ఇవి. మనం తెలియకుండా పడేస్తుంటాం. అందులో ఒకటి ఆనపకాయ విత్తనాలు. ఇందులో పోషకాలు చాలా ఎక్కువ మోతాదులో ఉంటాయి. ముఖ్యంగా ఫైబర్, ప్రోటీన్లు, మోనో అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, మాంగనీస్, మెగ్నీషియం, ఫాస్పరస్‌తో పాటు ఫైటో స్టెరోల్ ఉండటంతో కొలెస్ట్రాల్ సమస్య చాలా త్వరగా తగ్గుతుంది.

ఇక రెండవది ఫ్లక్స్ సీడ్స్. ఇందులో ఫైబర్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఆల్ఫా లినోలెనిక్ యాసిడ్ పెద్ద మొత్తంలో ఉంటాయి. కొలెస్ట్రాల్ తగ్గించాలంటే ఈ విత్తనాల్ని పౌడర్‌గా చేసుకుని నీళ్లలో కలుపుకుని తాగితే మంచి ఫలితాలుంటాయి. దీంతోపాటు చియా సీడ్స్ కూడా కొలెస్ట్రాల్ తగ్గించేందుకు దోహదం చేస్తాయి. ఇందులో కూడా ఫైబర్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్‌తో పాటు ఇతర పోషకాలుంటాయి. వీటితోపాటు ఇందులో ప్రోటీన్లు, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, యామిన్, మెగ్నీషియం, మాంగనీస్ పుష్కలంగా ఉంటాయి.

ఇక మరో అద్భుతమైన ఔషధ గింజలు నువ్వులు. ఇతర విత్తనాల్లానే ఇందులో కూడా పోషక పదార్థాలు ఎక్కువ. ఫైబర్, 5 రకాల ప్రోటీన్లు, మోనో అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, కాపర్, మాంగనీస్, మెగ్నీషియం ఉంటాయి. ఈ విత్తనాలను రోజువారీ డైట్‌లో భాగంగా చేసుకుంటే అద్భుతమైన ప్రయోజనా లుంటాయి. కేవలం కొలెస్ట్రాల్ తగ్గడమే కాకుండా బెల్లీ ఫ్యాట్ నిర్మూలనకు దోహద పడుతుంది. మధుమేహం నియంత్రణకు కూడా ఈ విత్తనాలు ఉపయోగకరంగా ఉంటాయి.

# కీళ్లు నొప్పులతో బాధపడుతున్నారా?



నిలబడలేకపోవడం, నడవలేకపోవడం, కీళ్లు పట్టేయడం వంటి సమస్యలు ఉన్నవారు మన చుట్టుపక్కల లభించే పారిజాత ఆకులతో చెక్ పెట్టవచ్చు. పారిజాత వృక్షాన్ని దైవ వృక్షంగా చెబుతుంటారు. సాధారణంగా నేలపై రాలిన పూలు పూజకు శ్రేయస్కరం కాదని అంటారన్నది తెలిసిన విషయమే కదా. కానీ పారిజాత వృక్షం నుండి రాలిన పువ్వులు మాత్రమే కింద పడినా పూజకు ఉపయోగ పడతాయి. దీని వెనుక ఒక పురాణం కూడా ఉంది. అది పక్కన పెడితే కీళ్ల నొప్పులను తగ్గించడంలో పారిజాత ఆకులు ఎలా ఉపయోగ పడతాయో తెలుసుకుందాం.

కొద్ది దూరం నడవగానే మోకాళ్లు నొప్పి పెడుతున్నాయా? అయితే అది ఆర్థరైటిస్ సమస్య కావచ్చు. ఇది సీరియస్ అయితే నడిచే పరిస్థితి కూడా ఉండదు. అందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఒక్కసారి ఆర్థరైటిస్ (కీళ్ల నొప్పులు) మొదలైతే ఆ సమస్య వెంటాడుతూనే ఉంటుంది. దానిని నివారించడం చాలా ముఖ్యం. ఆర్థరైటిస్‌కి వయసుతో సంబంధం లేదు. ఇప్పుడు టీనేజర్లకు కూడా సరైన ఆహారం తీసుకోవడం వల్ల కీళ్లనొప్పులు వస్తున్నాయి. కీళ్ల నొప్పుల్లో చాలా రకాలు ఉన్నప్పటికీ, లక్షణాలు ఒకే విధంగా ఉంటాయి. కీళ్లనొప్పులు, ఎముకల నొప్పులు, ఎక్కువసేపు నిలబడలేక పోవడం, నడవలేకపోవడం, బ్యాలెన్స్ కోల్పోతూ ఉండేవారు, కీళ్లు పట్టేయడం వంటి సమస్యలు ఉన్నవారు మన చుట్టుపక్కల లభించే పారిజాత ఆకులతో ఆ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. కీళ్ల నొప్పులను తగ్గించడంలో పారిజాత ఆకులు ఎలా ఉపయోగపడతాయో తెలుసుకుందాం.

6-7 పారిజాత ఆకులను తీసుకుని వాటిని శుభ్రంగా కడిగి మెత్తగా పేస్ట్ చేయాలి. ఈ పేస్ట్‌ను ఒక గ్లాసు నీళ్లలో మిక్స్ చేసి ఓ గిన్నెలో పోయాలి. సగం గ్లాసు వచ్చేవరకు బాగా మరిగించాలి. ఆ కషాయాన్ని రాత్రిపూట అలానే ఉంచి మరుసటి రోజు ఉదయం మేల్కొన్న వెంటనే తాగాలి. ఇలా నెల రోజుల పాటు చేస్తే కీళ్ల నొప్పులు తగ్గుతాయి. పారిజాత ఆకుల్లోని జిగురు కషాయం ద్వారా శరీరంలోకి వెళ్లి అరిగిపోయిన మోకాలి కీళ్లపై పనిచేస్తుంది. ఇది కీళ్ల నొప్పుల నుండి కొంత ఉపశమనం కలిగిస్తుంది. అలాగే కొబ్బరి నూనెలో 5-6 చుక్కల పారిజాత నూనె వేసి కీళ్ల నొప్పులు ఉన్నచోట కాసేపు మసాజ్ చేయాలి. ఇలా కొన్ని రోజులు చేస్తే నొప్పులు తగ్గుతాయి.

**పారిజాత ఆకుల కషాయం వల్ల మరికొన్ని లాభాలు:**

మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులపై పోరాడేందుకు కావాల్సిన శక్తి లభిస్తుంది. జలుబు, దగ్గు, ఆస్తమా సమస్యలను నుంచి స్వాంతన లభిస్తుంది. యాంటీ అలర్జిక్, యాంటీ వైరల్, యాంటీ బాక్టీరియల్‌గా పనిచేస్తూ ఇన్‌ఫెక్షన్లు ఎదుర్కొనేందుకు సాయపడుతుంది. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఒత్తిడి తగ్గడంతో మలబద్దకం అనేదే ఉండదు. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అసిడిటీ, వికారం వంటి వాటిపై మంచిగా పనిచేస్తుంది.

# వెల్లుల్లి అనేక వ్యాధులకు దివ్య ఔషధం



భారతీయుల వంటల్లోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా వెల్లుల్లికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. నోటి వ్యాధులకు వెల్లుల్లి బాగా పనిచేస్తుంది. షుగర్ వ్యాధిగ్రస్తులకు వెల్లుల్లి దివ్య ఔషధం. మధుమేహగ్రస్తుల రక్తంలో చక్కెరస్థాయిలను నియంత్రిస్తుంది. వెల్లుల్లి మొత్తం శరీరంలోని 22 రకాల వ్యాధుల నుంచి రక్షణ ఇస్తుందని ప్రాచీన కాలం నుంచి ఉన్న నమ్మకం.

అతి ప్రాచీనమైన ఆయుర్వేద గ్రంథాలలో వెల్లుల్లి ప్రస్తావన ఉంది. వెల్లుల్లిలో అనేక పోషకాలు ఉంటాయి. ఔషధ గుణాలు ఉంటాయి. అందువల్ల వెల్లుల్లి మనల్ని ఆరోగ్యంగా ఉంచు తుంది. అయితే ఆరోగ్యకరమైన ప్రయో జనాలు పొందాలంటే వెల్లుల్లిని ఏ విధంగా తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

రోజూ పరగడుపునే రెండు వెల్లుల్లి రెబ్బలను నేరుగా నమిలి తినవచ్చు. పరగడుపున వెల్లుల్లి రసం కూడా తాగవచ్చు. ఇలాగే వెల్లుల్లి రెబ్బలు 4 తీసుకుని వాటిని కాల్చి తినవచ్చు. పెనం మీద కొంచెం నెయ్యి వేసి అందులో వెల్లుల్లి వేయించి తినవచ్చు. వెల్లుల్లి కషాయంలా చేసుకుని కూడా తీసుకోవచ్చు. 2 వెల్లుల్లి రెబ్బలు తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీటిని రోజుకు 2 సార్లు కప్పులు తాగవచ్చు.

ఇలా వెల్లుల్లిని తీసుకుంటే అనేక ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. హైబీపీ నియంత్రణలోకి వస్తుంది. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది.

చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా వెల్లుల్లి లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుతుంది. కనుక లివర్ సమస్యలున్నా వారు వెల్లుల్లి తింటే ఎంతో మేలు. వెల్లుల్లిని తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా మారుతాయి.

ఇక వెల్లుల్లి తినలేమనుకునేవారికి టాబ్లెట్స్ రూపంలో కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి. వైద్య సూచనలను అనుసరించి ఆ టాబ్లెట్స్ ను మోతాదులో తీసుకోవాలి. రోజూ తినే ఆహారంలో వెల్లుల్లిని ఏదొక రూపంలో తీసుకోండి ఆరోగ్యంగా జీవించండి.

# మాడిన వంటపాత్రలు కూడా తళతళా మెరవాలంటే!



మీ వంటింట్లో ఇప్పటికే చాలాసార్లు వంటపాత్రలు మాడిపోయి ఉంటాయి కదూ. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే పిల్లలకు టిఫిన్, లంచ్, స్నాక్స్ ఆఫీసుకెళ్లే భర్తకు లంచ్ హడావిడిగా వంట చేయడంలో ఇలా జరగడం కామన్. ఇక మీరు కూడా ఆఫీసుకెళ్లే గృహిణి అయితే.. ఆ మాడిపోయిన వంటపాత్రను కడిగేసరికి చేతులు అరిగిపోతాయ్. ఒక్కోసారి స్టవ్ పై పాలు పెట్టి మరిచిపోతే అవి కూడా మాడిపోతాయ్.

అంతేనా పాలు జస్ట్ పొంగినా అవి గిన్నె అంచులవద్ద ఆగిపోయి స్టవ్ నుంచి వచ్చే మంటకు గిన్నెకే అంటుకుపోయి మాడిన మచ్చల్లా ఉంటాయి. ఎంత సబ్బు వాడినా టీవీల్లో చూపించే యాడ్స్‌లో వచ్చే లిక్విడ్ లు వాడినా ఇలా తోమగానే అలా మెరిసిపోవడం అనేది ససేమిరా జరగదు. మాడిన వంటపాత్రలను క్లీన్ చేయడానికి పెద్ద యుద్ధమే చేయాలి. ఆ కష్టం ఎలా ఉంటుందో గృహిణులకు బాగా తెలుసు. అందుకే మీ కష్టాన్ని తగ్గించేందుకు మాడిన పాత్రల్ని ఈజీగా శుభ్రం చేసే ఓ చిట్కా తీసుకొచ్చాం. ఇందుకోసం పెద్దగా ఖర్చు కూడా చేయనక్కర్లేదు.

**ఇలా తయారు చేయండి:** ఒక గిన్నెలో ఒక కప్పు లిక్విడ్ డిటర్జెంట్ తీసుకుని.. అందులో అదే కప్పు మోతాదులో నీరు పోయాలి. ఇప్పుడు అందులోనే 2 టేబుల్ స్పూన్ల ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ వంటసోడా వేసి బాగా కలిసేలా కలపాలి. ఈ మిశ్రమంలో పాత్రలు తోమే పీచును ముంచి మాడిన వంటపాత్రలను కడిగితే వాటికి అంటుకున్న మాడు అంతా ఇట్టే వదిలిపోయి కొత్తపాత్రలు వలే తళతళ మెరుస్తాయి.

**టాయిలెట్స్ కూడా శుభ్రం చేసుకోవచ్చు:**

అలాగే ఈ లిక్విడ్‌తో సింక్, జిడ్డు పట్టిన స్టవ్ ను కూడా ఈజీగా శుభ్రం చేసుకోవచ్చు. టాయిలెట్‌ను శుభ్రం చేసేందుకు కూడా ఈ లిక్విడ్‌ను వాడొచ్చు. మనం తయారు చేసుకున్న ఈ లిక్విడ్‌తో టాయిలెట్‌ను కడిగితే దానిపై పసుపు పచ్చగా పేరుకున్న మరకలు పోయి తెల్లగా వస్తుంది. ఇంకెందుకు ఆలస్యం వెంటనే ఈ చిట్కా ఉపయోగించి మాడిన మీ వంటపాత్రల్ని ఈజీగా శుభ్రం చేసుకోండి.

# జామకాయలు ఎప్పుడు ఏ సమయంలో తింటే మంచిది



ప్రకృతిలో లభించే వివిధ రకాల పండ్లలో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. బొప్పాయి, జామ, ఆరెంజ్, ఆపిల్, బత్తాయి, నిమ్మ, దోసకాయ, పుచ్చకాయ, అరటి, సపోటా, మామిడి ఇలా ఎన్నో రకాల పండ్లను ఇవ్వడం ద్వారా ప్రకృతి మన ఆరోగ్యానికి కారణమయ్యే అన్ని రకాల పోషకాల్ని ఇస్తుంటుంది. వీటిలో ప్రధానమైనవి జామ కాయలు.

జాంపండు లేక జామకాయలు నిస్సందేహంగా ఆరోగ్యానికి చాలా మంచివి. ఎందుకంటే కొన్ని రకాల పండ్లకు దూరంగా ఉండాల్సిన మధుమేహం వ్యాధిగ్రస్తులు కూడా జామకాయలు తినడం చాలా మంచిది. జాంకాయల్లో ఉండే అద్భుతమేంటంటే తినే సమయాన్ని బట్టి దాని విలువ మారుతుంటుంది. ఆశ్చర్యంగా ఉన్నా ఇదే నిజం. జామకాయలు ఉదయం పూట తింటే కలిగే ప్రయోజనాల విలువ బంగారంతో సమానం. అదే మధ్యాహ్నం తింటే కలిగే ప్రయోజనాల విలువ వెండితో సమానం. ఇక రాత్రి వేళ తింటే కలిగే ప్రయోజనాల విలువ బ్రాంజ్ తో సమానమంటారు. అంటే ఉదయం తినడం అన్నింటికంటే అద్భుతమైంది. ఉదయం పూట తినడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయి.

జామకాయలు లేదా జాంపళ్ల కడుపుకి చాలా మంచిది. జీర్ణ సంబంధిత సమ స్యలుంటే తొలగి పోతాయి. రోజూ ఉదయం పూట తింటే ఇందులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్ కారణంగా మధు మేహం వ్యాధిగ్రస్థులకు ప్రయో జనం కలుగు తుంది. రోజూ జామకాయలు తింటే బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణ లో ఉంటాయి. ఇందులో ఐరన్ కంటెంట్ ఎక్కువ. అందుకే ఎనీమియా లోపముండేవాళ్లు రోజూ జామకాయలు తింటే చాలా మంచిది. అన్నింటి కంటే ముఖ్యంగా ప్రోస్టేట్ కేన్సర్ ముప్పు తగ్గుతుంది. శరీరంలో కణితి ఏర్పడే ప్రక్రియను ఆపగలుగుతుంది. జామలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల మలబద్ధకం సమస్య పోతుంది. అదే సమయంలో ఇమ్యూనిటీ బలపడుతుంది.

తెల్లజామ కంటే ఎర్ర జామలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందుకే రోజూ ఇవి తినడం అలవాటు చేసుకుంటే చర్మ సంబంధిత సమస్యలు దూరమౌతాయి. ఎర్రజామ కేన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇక వీటన్నింటికీ తోడు రోజూ జాంకాయలు తింటే పంటి సంబంధింత సమస్యలు, చిగుళ్ల సమస్యలకు మంచి పరిష్కారం లభిస్తుంది. పంటి సమస్యలను, చిగుళ్ల సమస్యల్ని జాంకాయలు అద్భుతంగా తగ్గించ గలుగుతాయి. జాంకాయలే కాదు లేత జామాకులు కూడా అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తాయి.

# సమయానికి నిద్రపోవడం లేదా?



నిద్ర లేకపోవడం, సరిగా నిద్రపోకపోవడం మొత్తం ఆరోగ్యానికి హానికరం. అందుకే ప్రతి రోజూ కనీసం 6-8 గంటలు నిద్రపోవాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. లండన్‌లోని కింగ్స్ కాలేజ్ పరిశోధకుల ప్రకారం నిద్ర విధానాలలో చిన్న క్రమరాహిత్యాలు కూడా జీవక్రియను ప్రభావితం చేస్తాయి. ఈ పరిశోధన బృందంతో సీనియర్, డాక్టర్ వెండీహాల్ ప్రకారం నిద్రకు అంతరాయం, రాత్రివేళ పని చేయడం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది జీర్ణ క్రియను నెమ్మదింపజేస్తుంది. పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియాను నిర్మూలిస్తుంది. ఫలితంగా అనారోగ్య సమస్యలు ఒక్కొక్కటిగా ప్రారంభమవుతాయి.

మనం అనుసరించే రోజువారి దినచర్యే మన ఆరోగ్యాన్ని నిర్దేశిస్తుంది. ఆరోగ్యం బాగుండాలంటే జీవనశైలి కూడా బాగుండాలి. లేదంటే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుత కాలంలో ఒత్తిడితో కూడిన జీవనశైలి కారణంగా నేడు పెద్దవారి కంటే యువతలోనే చాలా ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అందులో ముఖ్యమైనది నిద్ర. దిన చర్యలో నిద్రకు సరైన సమయం లేకపోతే, అది నేరుగా మీ జీర్ణక్రియను ప్రభావితం చేస్తుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల పేగులో హానికరమైన బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తుంది. ఈ రకమైన బ్యాక్టీరియా జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తుంది. ఇక అవి కడుపులో ఉండే మంచి బ్యాక్టీరియాను కూడా తగ్గిస్తాయని పరిశోధకులు నిర్ధారించారు.

పరిశోధకుల ప్రకారం నిద్ర, మేల్కొనే సమయానికి మధ్య 90 నిమిషాల గ్యాప్ మైక్రోబయోమ్‌ను ప్రభావితం చేస్తుంది. ఇది ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని పరిశోధకులు అంటున్నారు.

**నిద్ర లేకపోవడం వల్ల ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలు ఏంటో తెలుసుకుందాం..**

నిద్రలేమి సమస్య కారణంగా పేగుల్లో చెడు బ్యాక్టీరియా పెరుగుతుందని పరిశోధకులు కనిపెట్టారు. నాణ్యత లేని ఆహారం, జంక్ ఫుడ్స్ ఊబకాయం, కార్డియోమెటబోలిక్, గుండెపోటు, స్ట్రోక్, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతాయి. గట్‌లో మంచి బ్యాక్టీరియా లేకపోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం క్షీణిస్తుంది. ఇది అనేక వ్యాధులకు దారితీస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇక నిద్రలేమి కారణంగా శరీర బరువు పెరిగే ప్రమాదం ఉంది. అధిక బరువుతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుంది. రోజంతా నిరుత్సాహంగా ఉండటం, నిస్సత్తు వగా ఉంటుంది. నిద్రలేమి సమస్య జ్ఞాపకశక్తిపైనా ప్రభావం చూపుతుందంటున్నారు పరిశోధకులు. మెదడు పనితీరు నెమ్మదిస్తుందని చెబుతున్నారు.

**ఈ సమస్యలు రావొద్దనుకుంటే**

ఊబకాయం, గుండెపోటు, అధిక కొలెస్ట్రాల్, జీర్ణక్రియ సరిగా ఉండాలంటే అన్నింటికి మెడిసిన్ సరైన నిద్ర అని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. రోజుకు కనీసం 6 నుంచి 8 గంటలు నిద్రపోవాలని సూచిస్తున్నారు. అలాగే, జంక్ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలని వార్నింగ్ ఇస్తున్నారు. సరైన జీవనశైలితోనే సరైన ఆరోగ్యం ఉంటుందని హితవు చెబుతున్నారు పరిశోధకులు.

# కోడిగుడ్లు తినేవారు తెలుసుకోవాల్సిన విషయాలు

కోడిగుడ్లని తినడం ద్వారా మధుమేహం, టైప్-2 మధుమేహంతో బాధపడేవాళ్లకి మేలు చేస్తాయి. అంతేకాదు గుండెజబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని పరిశోధకులు గుర్తించారు. కోడిగుడ్లు తింటే కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసు కుందాము. కోడిగుడ్లు మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. గుడ్డులో కోలిన్ వుంటుంది. ఇది నీటిలో కరిగే విటమిన్, తరచుగా బి విటమిన్లతో వర్గీకరించబడుతుంది

గుడ్లు కంటి చూపును కాపాడుకోవ డానికి సహాయ పడతాయి. తగినంత ప్రోటీన్లు, అమైనో ఆమ్లాలు గుడ్డులో ఉంటాయి. కోడిగుడ్లు గుండెకి చెడ్డవి కావు. గుడ్లు విటమిన్ డిని కలిగి వుంటాయి. ఆరోగ్యవంతులు వారా నికి ఏడు గుడ్ల వరకూ తినవచ్చు. అనారోగ్యవంతులు వైద్యుల సలహా మేరకు తీసుకోవాలి.

పచ్చి గుడ్లు చర్మానికి చాలా మేలు చేస్తాయి. గట్టిగా ఉడికించిన గుడ్లు లీన్ ప్రోటీన్ అద్భుతమైన మూలం.



## ప్రైవేట్ సంస్థల ఉద్యోగులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అఖిల భారత సిటు కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10 వ తేదీన అఖిల భారత ప్రొటెస్ట్ రోజుగా పాటించాలని సూచించారు. దీనిలో భాగంగా నూకరాజు అధ్యక్షతన సెవెన్ హిల్స్ హాస్పిటల్ హాస్టల్ ఉద్యోగులతో కార్యక్రమం జరిగింది. షాపింగ్ కార్మికుల సంఘం నాయకుడు కే వీ పీ చంద్ర మౌళి మాట్లాడుతూ, ఉద్యోగుల అందరికీ 26,000 రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయుడు బాల వేల గాని , పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## పోలవరాన్ని పూర్తి చేయడమే చంద్రబాబు ఆశయం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 11వ తేదిన రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటించనున్నారని రాష్ట్ర హోమ్ శాఖామాత్యులు వంగలపూడి అనిత తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో అనకాపల్లి కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.వి.మురళీక్రిష్ణతో కలసి యస్. రాయవరం మండలం దార్లపూడి సమీపంలో పోలవరం లెఫ్ట్ మెయిన్ కేనాయిల్ ను, హెలిప్యాడ్ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర హోమ్ శాఖామాత్యులు వంగలపూడి అనిత మాట్లాడుతూ ఈ నెల 11 తేదిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటిస్తారని, ముందుగా యస్ రాయవరం మండలం దార్లపూడి సమీపంలో పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాయిల్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలిస్తారని తెలిపారు. పోలవరాన్ని పూర్తి చేసి, రైతాంగాన్ని ఆదుకోవాలనేది ముఖ్య మంత్రి ఆశయమని, ఎల్లప్పుడు పోల వరం ప్రాజెక్ట్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచిస్తారని, అతి తొందరలో పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 11వ తేది ఉదయం విశాఖ ఎయిర్ పోర్టు నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి హెలిక్యాప్టర్ లో దార్లపూడి చేరుకుంటారని, పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాయిల్ పరిశీలన అనంతరం భోగాపురం ఎయిర్ ఫోర్టు పనులను పరిశీలిస్తారని హోమ్ మంత్రి తెలిపారు. తదుపరి భోగాపురం నుండి విశాఖపట్నం చేరుకోని విశాఖలో పలు కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారని అన్నారు.

ఈ పర్యటన కార్యక్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చెరువులో పడి ఇద్దరు మృతి



బహిర్భూమికి వెళ్లి చెరువులో పడిన విద్యార్థితో సహా అతని కాపాడబోయిన యువ కుడు కూడా మృతి చెందారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండల కేంద్రం నందు ఉన్న జెడ్.పి.హెచ్ స్కూల్లో 6వ తరగతి చదువుతున్న విష్ణు(11) బహిర్భూమికి వెళ్లాడు. దగ్గరలో ఉన్న చెరువులో జారిన చెప్పులు తీయబోయి ప్రమాదవశాత్తు దానిలో పడిపోయాడు. ఇది గమనించిన యువకుడు కంసాల నవీన్ (25) విద్యార్థిని కాపాడబోయి ఇతను కూడా ఊబిలో ఇరుక్కున్నాడు. ఈ విషయాన్ని మిగిలిన విద్యార్థులు వెంటనే అక్కడ ఉన్న స్కూల్ టీచర్ చెప్పడంతో గ్రామస్తులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. అప్పటికే యువకుడు నవీన్ మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న విష్ణును హాస్పిటల్లో చేర్చారు. విష్ణు చికిత్స పొందుతూ మృతి చెందారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**విజయనగరం:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి జిల్లా పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవారం పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు ప్రాంతంలో కలెక్టర్ పర్యటించి, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. భద్రతా ఏర్పాట్లపై ఎస్పి దీపికా పాటిల్‌తో చర్చించారు. ఇప్పటికే నిర్మితమైన రన్‌వేపై ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ స్థలాన్ని ముందుగా కలెక్టర్ పరిశీలించారు. అక్కడినుంచి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వద్దకు చేరుకొని వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ఇక్కడ ఫొటో ఎగ్జిబిషన్, విఐపి లాంజ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. వర్షాకాలం కావడంతో, జెర్మన్ హేంగర్లతో పటిష్టమైన షెడ్లను నిర్మించాలని సూచించారు. అనంతరం టెర్మినల్ భవనం వద్దకు చేరుకొని ఏర్పాట్లపై సమీక్షించారు.టెర్మినల్ భవన నిర్మాణ పనుల పరిశీలన అనంతరం, అక్కడే ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడతారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తొలిసారిగా ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ పర్యటనలో ఎస్పి దీపికా పాటిల్‌తోపాటు, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, జెడ్‌పి సిఈఓ శ్రీధర్ రాజా, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, పోలీసు, ఆర్ అండ్‌బి అధికారులు, జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు హెడ్ రామరాజు, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆంధ్ర యూనివర్సిటీ "ఇన్ ఛార్జ్ వైస్ ఛాన్సలర్" ని తక్షణమే నియమించాలి



**అమరావతి:** ఆంధ్ర యూనివర్సిటీ ఇన్ ఛార్జ్ వైస్ ఛాన్సలర్ ను తక్షణమే నియమించాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి శ్రీ నారా లోకేష్ గారిని ఉండవల్లి మంత్రి నివాసంలో కలిసి వినతి పత్రాన్ని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్‌పితాని ప్రసాద్ మరియు నేషనల్ దళిత్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొయ్యే ఆనంద్ రత్న కుమార్ అందజేసారు.

ఎ.యూ ఉన్నతాధికారు లేకపోవడం వల్ల ఉద్యోగులు, విద్యార్థులు సంక్షేమం సంబంధించిన తగిన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. త్వరలోనే నియమిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు.

## అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి




**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి , స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి మినిమం 26,000 వేల జీతం పెంచి, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆల్ ఇండియా పిలుపులో భాగంగా పార్వతిపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు కోశాధికారి గొర్లెల వెంకటరమణ ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాటా డుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడులుగా తీసుకురావడం దుర్మార్గమని తెలిపారు. అత్యంత దుర్మార్గమైన చర్యని భావించారు.. కార్మికులు ఉద్యోగుల ద్వారా అధికారంలోకి వచ్చినటువంటి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా నిర్ణయంచేయడం దారుణమని తెలిపారు. దేశంలో ఉన్న ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటీకరించడం వారి చేతగాని తనానికి నిదర్శనం అని తెలిపారు. రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, విద్యుత్, ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఆప్ కాను ప్రభుత్వ డిపార్ట్మెంట్లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు మధ్యాహ్న భోజనం , సమగ్ర శిక్ష ,విద్య, వైద్య104,108, రంగంలో పనిచేసే వారందరికి జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కలిగించా లన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగస్తులు పెండింగ్ జీతాలు చెల్లించాలి ఆటో, రైస్ మిల్లు, హామాలీ ,బిల్డింగ్, తోపుడు తదితర అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటి b. నాయకులు, జ్యోతి. శాంతి. తులసి. శివాని. గౌరీశ్వరి , గౌరీ, అలివేలు మంగ, కృష్ణ, పాకల సన్యాసిరావు తదితర కార్మికులు పాల్గొన్నారు.

## కార్మికులకు సమగ్ర చట్టం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అఖిల భారత సిటు కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10 వ తేదీన అఖిల భారత ప్రొటెస్ట్ రోజుగా పాటించాలని సూచించారు. దీనిలో భాగంగా సిటు నేత ఎం.సుబ్బారావు అధ్యక్షతన ముఠా కళాశీలతో 35 వార్డు పరిధి టౌన్ కొత్త రోడ్డు ,పూర్ణ మార్కెట్ వద్ద కార్యక్రమం జరిగింది. షాపింగ్ కార్మికుల నాయకుల సంఘం నాయకుడు కే వీ పి చంద్ర మౌళి మాట్లాడుతూ, కళాశీలు అందరికీ సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిటు నాయకుడు వై. రాజు మాట్లాడుతూ, ముఠా కళాశాల పోరాటం వల్ల హక్కులను సాధించామనీ ఇంకా సాధించాలని చెప్పారు. పెద్ధ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి... సమరసత సేవ ఫౌండేషన్



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ మండలం లంకెలపాలెం గ్రామంలో శ్రీ సీతారాములు దేవాలయ కేంద్రంగా ఆషాడమాసంలో గోరింటాకు ప్రత్యేకం జిల్లా మహిళా కన్వీనర్ శ్రీమతి రామలక్ష్మి గారు మాట్లాడుతూ గోరింటాకు ప్రత్యక్ష ఆషాడ మాసంలో పెట్టుకోవడం వల్ల ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం కొన్ని రోగాలు పోతాయి అని అలాగే ప్రతీ ఒక్కరు గోరింటాకు చేతులకు కాళ్లకు ప్రతి ఒక్కరు గోరింటాకు పెట్టుకొని ఆరోగ్యం ఉండాలని అలాగే గౌరీదేవి పార్వతి పరమేశ్వర ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ప్రతి ఒక్కరు ఈ ఆషాడమాసంలో అతి పవిత్రమైన గోరింటాకును ప్రతి ఒక్కరు పెట్టుకొని మన పక్క వారు కూడా చెప్పాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధిక సంఖ్యలో మహిళా మాతృమూర్తులు, మండల కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి బొద్దపు నూకరత్నం, బొద్దపు పూర్ణ, ఎ వెంకటరమణ, ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## టైర్లు లేని కారును చూశారా?!



రోడ్డుపై టైర్లు లేని కారుని చూశారా? అదేంటి టైర్లు లేకుండా కారా? అదెలా సాధ్యం? ఎలా నడుస్తుంది? ఇలాంటి సందేహాలెన్నో వస్తాయి. ఈ సందేహాలన్నింటికీ చెక్ పెడుతూ.. సూరత్ నగరంలో టైర్లు లేని కార్లు తిరుగుతున్నాయి. ఈ కార్లను ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు తయారుచేశారు. పర్యావరణానికి హాని చేయని ఈ ఎలక్ట్రిక్ కార్లు అందుబాటు ధరలోనే లభించడం విశేషం. ఈ కారును చూసిన వారందరూ విద్యార్థుల ప్రతిభను మెచ్చుకోవాల్సిందే.

ఈ కారుకు టైర్లే కాదండోయ్ స్టీరింగ్ కూడా ఉండదు. స్టీరింగ్‌కు బదులుగా గేమింగ్ జాయ్ స్టిక్‌లు, మొబైల్‌ని ఉపయోగించి నడిపించవచ్చు. సూరత్‌కు చెందిన శివమ్ మౌర్య, సంగమ్ మిశ్రా, దల్జిత్ అనే ముగ్గురు విద్యార్థులు 'ఫ్యూచరిస్టిక్ ఎలక్ట్రిక్ క్యాప్సూల్ ఆటోమొబైల్' కారును రూపొందించారు. ఈ కారును ఒక్కసారి ఛార్జ్ చేస్తే గంటకు 35 కిలోమీటర్ల వేగంతో 80 కిలోమీటర్ల వరకు పరుగెడుతుంది. ఈ కారు నాలుగు నుండి ఆరు అడుగుల పొడవు ఉంటుంది. ఇందులో డ్రైవర్ కూర్చోవచ్చు. దీని ధర రూ. 65,000. ఈ ఫ్యూచరిస్టిక్ క్యాప్సూల్ కార్‌ని పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకునే విద్యార్థులు తయారుచేశారు. రాబోయే రోజుల్లో ఎఐ టెక్నాలజీ రాబోతోంది. ఎఐ టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని ఈ వాహనాన్ని తయారుచేమని శివమ్ మౌర్య అనే విద్యార్థి చెప్పాడు. ఈ నేపథ్యంలో శివమ్ మాట్లాడుతూ.. 'అందరికీ నచ్చేవిధంగా ఈ వాహనం సర్కిల్ ఆకారంలో రూపొందించాము. మూడున్నర నెలల నుంచి ఈ కారు సూరత్ రోడ్లపై నడుస్తున్నాయి. ఈ కారు సక్సెస్ కావడంతో.. భవిష్యత్తులో ఎగిరే కారును తయారుచేయాలని మేము అనుకుంటున్నాము. కానీ దాన్ని తయారుచేసేందుకు మా దగ్గర డబ్బులు లేవు. బహుశా ఆ కారును తయారుచేయడానికి చాలా సమయం పట్టొచ్చు' అని అన్నారు.

## జగన్..ఇలాగైతే వారసత్వమూ గల్లంతే..!

అధికారముకై పెనుగులాటలో అన్న..చెల్లి పోటీ..!

అది..2004..

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గ సభ్యులను.. ఎమ్మెల్యేలను తన ఇంటికి విందుకు తీసుకువెళ్ళారు.అప్పుడు తనతో పాటు అదే కారులో ఉన్న సన్నిహితుడు ఒకాయనతో ఆయన ఇలా అన్నారు..

ఈ కుర్చీ అందుకోడానికి నాకు పద్దెనిమిదేళ్ళు పట్టిందయ్యా..

అంటే ముఖ్యమంత్రి కావాలన్న లక్ష్యాన్ని వైఎస్సార్ 1986 నుంచి నిర్దేశించుకున్నారన్న మాట..అంతకు చాలా ముందే ఆయన ఎమ్మెల్యే.. శాసనసభ్యుడైన తర్వాత ముఖ్యమంత్రి అయ్యే వరకు ఆయన మంత్రిగా.. సిఎల్పీ నాయకుడిగా.. ఎంపీగా వివిధ హోదాల్లో పని చేసినా సిఎం అవ్వాలన్న లక్ష్యం విషయంలో ఆయన ఏ దశలోనూ తగ్గింది లేదు.

మన మధ్య లేని మనిషి గురించి ఈ మాటలు తగవని ఎంతగా అనుకున్నా తప్పడం లేదు.ముఖ్యమంత్రి కావాలన్న తన కలను సాకారం చేసుకునేందుకు ఆయన తొక్కని దారి లేదు.

అడిగారు..కడిగారు.. అదమాయించారు... గదమాయించారు.. తమాయించారు..

ఫ్యాక్షన్..ఫిక్షన్.. యాక్షన్..ఓవరాక్షన్.. కల్లోలాలు...మ2త కలహాలు.. దూషణలు..ఆరోపణలు.. చాప కింద వ్యవహారాలు.. తెరచాటు రాజకీయాలు.. ఆయన కొడుకు వైనాట్ అని మొన్న అన్నట్టు ఆయన వాట్ నాట్.. చెయ్యదగినవి..చెయ్యరానివి చాలా చేసారు.దానాదీనా చెప్పొచ్చిందేంటంటే ఎన్ని చేసినా సిఎం కావడానికి ఆయనకి పద్దెనిమిదేళ్ళు పడితే ఆయన పుత్రరత్నం ఆయన మరణించిన ఉత్తరక్షణం నుంచే సింహాసనం తన వారసత్వ హక్కు అన్నట్టు శవం ఉండగానే వశం చేసుకునే ప్రయత్నం చేసారు. అప్పటికి ఆయనకి రాజకీయ అనుభవం నాలుగు నెలలు. అది కూడా ఎంపీగా.. మహాసముద్రం వంటి కాంగ్రెస్ పార్టీలో ఎంతో మంది సీనియర్లు ఉండగా ముఖ్యమంత్రి పదవి తమ కుటుంబ సొంత ఆస్తి అన్నట్టు ఆ కుర్చీ కోసం సోనియా గాంధీపైనే తిరగబడ్డారు.

అప్పటివరకు జగన్ అనే వ్యక్తి చేసినట్టుగా చెబుతున్న అవినీతి పనులను ఆయన తండ్రి ఎటూ కాసుకొచ్చారు.

ఎప్పుడైతే ఆయన ముఖ్యమంత్రి పదవి కోసం అధినేత్రిపైనే తిరుగుబాటు చేశారో మొత్తం ఆయన అవినీతి చిట్టా బయటికి వచ్చింది.తదనంతర కాలంలో ఆయనకి జైలు.. బెయిల్ మంజూరులో జాప్యం.. 2014 ఎన్నికల ముందు విడుదల..వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పురుడు..తల్లి కాంగ్రెస్ నుంచి మొత్తం లాగేసుకుని తన పార్టీలోకి లాగిన్ చేసేసుకున్న వైనం.. మొదటి ప్రయత్నంలో విఫలం.. 2019 లో ఘన విజయం.. దక్కిన ముఖ్యమంత్రి పీఠం.. ప్రజలు బ్రహ్మరథం పట్టినా నిలబెట్టుకోలేకపోయిన తీరు...మొన్న 2024 లో నిండా మునిగిన వైనం...ఆ గమనం అబ్బో అదో పెద్ద కథనం..!

మొత్తానికి వైఎస్సార్ అంత పకడ్బందీగా అన్ని ప్రణాళికలు రచించి అమలు చేసి సాధించుకున్న సిఎం కుర్చీని ఆయన పుత్రరత్నం వంశపారంపర్య హక్కుగానే గాక జీవిత పర్యంతం తన వద్దనే ఉండే కుటుంబ ఆస్తిగా భావించి అయిదేళ్ల పాలనను ఇష్టారాజ్యంగా సాగించి చివరకు చెయ్యి కాల్చుకున్నారు.

ఇక్కడి వరకు ఒక రకమైన కథ నడిస్తే మొన్న 2024 ఎన్నికలకు ముందు వైఎస్ కుటుంబంలో మొదలైన వారసత్వ పోటీ ఖచ్చితంగా 2029 నాటికి ముదురు పాకాన పడడం తథ్యం.ఇన్నాళ్లు ఒక లెక్క.. ఇప్పుడాయన కూతురొచ్చింది..

అంటూ రాజశేఖర రెడ్డి వారసత్వ ట్యాగ్ తో కుమార్తె షర్మిల గల్లీలోకి దిగింది. నిజానికి షర్మిల జగన్ కంటే వాగ్ధాటి కలిగిన వ్యక్తి.. అన్నతో పోలిస్తే ఆమె చరిత్రలో రక్తం లేదు..భోక్తం లేదు..! 2019 లో జగన్ పార్టీ గెలుపులో షర్మిల పాత్ర కీలకం. ఇప్పుడు ఆమె కాంగ్రెస్ వంటి పెద్ద పార్టీలో ఉంది. మొన్నటి ఎన్నికల్లో జాతీయ స్థాయిలో బాగా పుంజుకున్న కాంగ్రెస్ వచ్చే ఎన్నికల నాటికి అటు కేంద్రంలో.. ఇటు రాష్ట్రంలో గెలిచి రెండు చోట్ల పూర్వవైభవం తెచ్చుకోవాలన్న సంకల్పంతో ఉంది.ఈ క్రమంలో కాంగ్రెస్ అధిష్టానం నుంచి షర్మిలకు అన్ని విధాలుగా పూర్తి ప్రోత్సాహం..మద్దతు ఉంటాయి.ఒకవేళ జగన్ కాంగ్రెస్ లోకి రావాలని అనుకున్నా..తన పార్టీని మాతృసంస్థలో విలీనం చేయాలని అనుకున్నా అందుకు షర్మిల గ్రీన్ సిగ్నల్ తప్పని సరి. మరి జగన్ ఏం చేస్తారన్నది వేచి చూడాలి. అయితే వైఎస్ వారసత్వానికి మాత్రం ఇకపై జగన్ ఎంతమాత్రం బ్రాండ్ అంబాసిడర్ కాబోరన్నది పక్కా.

ఇక్కడే మరో విషయం.. జగన్ శాసనసభ్యత్వానికి రాజీనామా ఇచ్చి ఎంపీగా పోటీ చేసి గెలిచి ఢిల్లీలో చక్రం తిప్పాలని అనుకుంటున్నట్టు గత కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఉట్టికెక్కలేనమ్మ సామెతలా ఉంది ఈ ఆలోచన అది నిజమైతే..!..

ఢిల్లీలో చక్రం సంగతి అటుంచితే..జగన్ ఎంపీగా వెళ్తే ఇక్కడ రాష్ట్రంలో వైఎస్ వారసత్వం ట్రేడ్ మార్క్ ఖచ్చితంగా షర్మిల ఎగరేసుకు పోతారు..అప్పుడు జగన్ పరిస్థితి ఉన్నదీ పోయింది..

చందాన అయిపోతుందేమో.. ఇంతా చేసి కడప పార్లమెంట్ బరిలో ఆయనకు చుక్కెదురైతే..అప్పుడిక ఆయన కెరీర్ కు కళ్లెం.. ఆయన పార్టీకి గొళ్ళెం.. తప్పవు..

జర సోచో జగన్ జీ.. ఇది పట్టీ కాదు..!

**సురేష్ కుమార్ ఎలిశెట్టి**
**జర్నలిస్ట్**
**9948546286**

## సీఎం గారు ఆంధ్ర యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర యూనివర్సిటీ కి తక్షణమే వైస్ ఛాన్సలను నియమించి పాలనను గాడిలో పెట్టాలని ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సురేష్ మీనన్ విశాఖపట్నం విచ్చేయనున్న సీఎం గారిని కోరుతున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ కృష్ణా యూనివర్సిటీ నుంచి వచ్చిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఎక్కడ జర్నలిజం డిపార్ట్మెంట్లో రూల్స్ కి విరుద్ధంగా నియమించటాన్ని డాక్టర్ పొన్నాడ శ్రీనివాసరావు తప్పుపట్టారు. ఆంధ్ర యూనివర్సిటీ గత ఐదు సంవత్సరాలలో జరిగినటువంటి అనేకమైనటువంటి అన్యాయాలు అక్రమాలపై జ్యూడిషల్ ఎంక్వైరీ ఎంక్వైరీ కమిటీ ఏర్పాటు చేయాలని విశాఖపట్నం పర్యటిస్తున్న సీఎం గారిని డాక్టర్ అర్జునుడు ప్రెసిడెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్ కోరుతున్నారు. స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ లో జరిగినటువంటి అనేకమైన న్యాయ విచారణ జరిపించాలని ఈ సందర్భంగా కోరటం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్ మీనన్ డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ దాస్ డాక్టర్ భాను డాక్టర్ సూరి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక ఉద్యోగులకు కనీస వేతనం 26000 ఇవ్వాలి... సిఐటియు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** కార్మిక ,ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని, వారి జీతాలను 26000 ఇవ్వాలని పరవాడ తహసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు నెలకు 26000 ఇవ్వాలని కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్ ల ను రద్దు చేయాలని ఆటో, ముఠా, బిల్డింగు, ఇతర అసంఘటితంగా కార్మికుల కు సమగ్ర చట్టం చేసి ఈఎస్ఐ,పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ,ఆశ, అంగన్వాడి, మధ్యాహ్నం భోజన పథకం వివోఏలు, వీఆర్ఏ వంటి స్కీం వర్కర్లకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులుసిహెచ్ దేవి, కే రమణి, ఆశ యూనియన్ లీడర్ ఏ వరలక్ష్మి, వివోఏ సంఘం ఎం ఉమామహేశ్వరి, వరలక్ష్మి, వీఆర్ఏ సంఘం ఆర్ శంకర్, ఎం రేవతి, పి పైడ్రాజు , స్కూల్ స్లీపర్ యూనియన్ రవణమ్మ , ఐద్వా మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వార్షికోత్సవం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మొదటి వార్షికోత్సవం స్థానిక కొత్తూరు కాలేజీ జంక్షన్ అభయ ఆంజనేయ స్వామి ప్రాంగణంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మొదటి వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రూరల్ ఏఎస్ఐ చేతుల మీదుగా దివ్యాంగులకు ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రమణబాబు మహిళలకు చీరలు పండ్లు ఏర్పాట్లు చేసి బీసీ సంఘ సభ్యులు అందరిచేత వారికి అందజేశారు

ఈ కార్యక్రమంలో అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ భాస్కర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వియ్యపు సన్యాసిరావు ఎకనామి క్ లెక్చలర్ విశాఖపట్నం రవికుమార్ విశ్వబ్రాహ్మణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిల్లా మహేష్ డి విక్రమ్ ఎమ్ మహేష్ వెంకట అప్పారావు మీడియా ఇంచార్జ్ రమేష్ కొత్తూరు మాజీ ఎంపీటీసీ కోన శ్రీను మరియు బిసి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# అస్వస్థకు గురైన రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నక్కపల్లి కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో సిపిటాక్సిం ఇంజిక్షన్ వికటించి తీవ్రమైన అస్వస్థకు గురైన 23 మంది రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు.

అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను బుధవారం ఉదయం సిపిఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెలైన్ బాటిల్ ఇంజెక్షన్ చేసిన తరువాత ఒకే రకమైన తీవ్రమైన చలి జ్వరంతో పాటు వనుకు కూడిన లక్షణంతో బాధపడి అస్వస్థకు గురైన రోగులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి మంగళవారం రాత్రి తరలించారు. నక్కపల్లి ఆసుపత్రిలో రోగులకు చేసిన ఇంజెక్షన్ సెలైన్ బాటిల్స్ వినియోగాన్ని తక్షణమే నిలిపివేసి వాటి పనితీరుపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వాటి పనితీరుపై డ్రగ్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక వచ్చే వరకు వాటి వినియోగాన్ని ఆపాలని కోరారు. రోగులు పూర్తిస్థాయి ఆరోగ్యస్థులు అయ్యే వరకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో అతిసార, డయోరియా జ్వరాలతో బాధపడుతున్న రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నాయి. సబ్ సెంటర్స్ స్థాయిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని, జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, సిపిఎం సీనియర్ నాయకులు నగిరెడ్డి సత్యన్నారాయణ, పాంగి చలపతి తదితరులు పాల్గొన్నారు.

# ఇంగ్లిష్‌లో ఇరగదీసిన అమరావతి ఆటో డ్రైవర్



ఓ ఆటోడ్రైవర్ అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడుతున్న వీడియో ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. మహారాష్ట్రలోని అమరావతికి చెందిన ఆయన ఇంగ్లిష్ భాషా నైపుణ్యం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆ ఇంగ్లిష్‌లో మాట్లాడటం వింటే ఆయన ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకున్నారా? అనిపించక మానదు. కేవలం ఆయన ఆంగ్లం మాట్లాడటమే కాదు.. అంతర్జాతీయ భాషను అందరూ నేర్చుకోవాలని ఆయన సలహా ఇవ్వడం మరో విశేషం. ఇంగ్లిష్ వస్తే లండన్, అమెరికా, పారిస్, ఇలా ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లొచ్చని ఆయన అంటున్నారు. ఆటో నడుపుతోన్న ఆ పెద్దాయన ఇంగ్లీష్‌లో అదరగొడుతుంటే.. వెనుక సీటులో ఉన్న ప్రయాణికుడు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు. ఈ వీడియోను సోషల్ మీడియాలో ఓ నెటిజన్ షేర్ చేయడంతో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

ఆయన ఇంగ్లిష్‌లో అనువుగా మాట్లాడుతుండటం చూసి నేనే ఆశ్చర్యపోయాను.. కొద్దిసేపు అలా ఉండిపోయాను' అని ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను పోస్ట్ చేసిన నెటిజన్ తెలిపాడు. "ఈ రోజు, నేను ఆటోను నడిపుతోన్న చాలా ఆశ్చర్యకరమైన పెద్దాయనను కలిశాను. మేము చాలా సరదాగా మాట్లాడాం.. కానీ అతను ఆంగ్లంలో చాలా అనర్గళంగా మాట్లాడటం.. ఆ భాషను నేర్చుకోవడానికి ప్రజలకు అవగాహన కల్పించడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది" అని వ్యాఖ్యానించాడు.

వైరల్ అవుతోన్న వీడియోలో ఆటోడ్రైవర్ "నేను చెప్పేది చాలా శ్రద్ధగా వినండి.. మీకు ఇంగ్లీష్ తెలిస్తే, మీరు లండన్, పారిస్, అమెరికా వెళ్లొచ్చు.. మీకు ఇంగ్లీషు రాకపోతే అక్కడికి వెళ్లలేరు" అనిపేర్కొన్నాడు. ఆ తర్వాత ఇంగ్లీషు ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఒక ఉదాహరణ ఇచ్చారు. 'మీరు లండన్ హోటల్‌లో ఉండి వెయిటర్‌ని 'గ్లాస్ ఆఫ్ వాటర్' అడిగితే ఇస్తాడు.. తప్పితే దీన్ని మరాఠీలో అడిగితే ఆ భాష తెలియదు కాబట్టి వెయిటర్ మిమ్మల్ని వెళ్లిపోమని చెబుతాడు.. నేను చెబుతున్నది ఏంటంటే.... మీరు ఇంగ్లిష్ నేర్చుకుని మాట్లాడండి.. ఇది అంతర్జాతీయ భాష' అని ఆయన చెప్పారు.

ఆటో ఎక్కిన యువకుడ్ని ఏం చదువుతున్నావని, ఎక్కడ ఉంటావని ఇంగ్లిష్‌లో అడిగారు. అందుకు ఆ యువకుడు తనది నాగ్‌పూర్ అని, మెడిసిన్ చదువుతున్నానని బదులిచ్చాడు. ఈ వీడియోను చూసి నెటిజన్లు ఆయన ఇంగ్లిష్‌కు ఫిదా అవుతున్నారు. గతంలో కేరళకు చెందిన ఆటోడ్రైవర్ ఇంగ్లిష్‌లో అదరగొట్టిన వీడియో.. ఓ విదేశీ పర్యాటకుడు తన సోషల్ మీడియాలో అకౌంట్‌లో పోస్ట్ చేయగా... ఇది వైరల్ అయ్యింది. ఆటో డ్రైవర్‌ని మెచ్చుకుంటూ అతనితో జరిగిన సంభాషణ గురించి పోస్ట్‌లో యూకేకు చెందిన ఆయన రాసుకొచ్చాడు. అలాగే, బెంగళూరుకు చెందిన 74 ఏళ్ల ఓ ఆటోడ్రైవర్ కూడా ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడిన వీడియోను ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ షేర్ చేశారు.

## ఫైళ్ల దహనం వ్యవహారం

### విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో పోలీసుల విచారణ



ఇటీవల కృష్ణా నది కరకట్టపై ప్రభుత్వ ఫైళ్ల దహనం వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ఆ ఫైళ్లపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) మాజీ ఛైర్మన్ సమీర్ శర్మ ఫొటోలు ఉన్నట్టు గుర్తించారు. దీనిపై నిగ్గు తేల్చేందుకు పోలీసులు విచారణను వేగవంతం చేశారు.

ఇవాళ విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో పోలీసులు విచారణ జరిపారు. పీసీబీలోని ఏడు విభాగాల అధికారులను పోలీసులు ప్రశ్నించారు. కార్యాలయం నుంచి ఫైళ్లు బయటికి వెళ్లడంపై ప్రశ్నించారు. ఫైళ్లు, హార్డ్ డిస్కులు బయటికి వెళ్లడంలో అధికారుల పాత్రపై విచారణ చేపట్టారు. దహనం చేసిన ఫైళ్లలోని అంశాలు, వాటి ప్రాధాన్యతపై ఆరా తీశారు. ఫైళ్లలోని సమాచారంపై పీసీబీ సిబ్బంది వాంగ్మూలాలు రికార్డు చేశారు.

## వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లును రద్దు చేయాలి

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందనీ జిల్లా కార్యదర్శి కే లోకనాథం అన్నారుముఖ్యమంత్రి చంద్రబాబు తొలసారి జిల్లాకు వస్తున్న సందర్భంగా వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై తమ వైఖరిని బహిర్గతం చేయాలని సిపిఎం కోరుతుంది. ప్రస్తుత ఐటి శాఖా మాత్యులు నారా లోకేష్ అధికారంలోకి రాకముందు చేపట్టిన యువగళం యాత్రలో వ్యవసాయ పంపుసెట్ల స్మార్ట్ మీటర్లును ధ్వంసం చేయాలని, మేము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని తెలియజేశారు. నేడు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ నిర్ణయాన్నే అమలు చేయడమంటే రైతులను మోసం చేయడం తప్ప మరొకటికాదు.ఒకసారి విద్యుత్ మీటర్ బిగించడమంటూ జరిగితే దానికి బిల్లులు వస్తాయి. బిల్లులతో రైతు మీద ఆర్థిక భారం పడుతుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇలాగే గ్యాస్ సబ్సిడీ అంటూ ఖాతాల్లో మొదట్లో మొత్తాన్ని వేసింది. మరి ఇప్పుడు పరిస్థితి ఏంటి.? అదే విధంగా రేపు రాష్ట్రంలో కూడా ఈ విద్యుత్ మీటర్ల విషయంలో ఇలాంటి అనుభవమే ఎదురవుతుందని రైతాంగం ఆందోళన చెందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ మీటర్లు ఏర్పాటుకయ్యే వ్యయాన్ని కూడా రైతాంగం నుంచి వివిధ రూపాల్లో చార్జీల క్రింద వసూళ్లు చేస్తారన్న ఆరోపణలు కూడా వున్నాయి. ఈ స్మార్ట్‌మీటర్లు అదాని, షిరిడిసాయి కంపెనీలకు లాభాల కోసం తప్ప రైతాంగం యొక్క ప్రయోజనాలకు కాదని సిపిఎం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను నిలుపుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది. లేదంటే గత ప్రభుత్వానికి ప్రజలు ఏ విధమైన గుణపాఠం చెప్పారో ఈ ప్రభుత్వానికి అదే గతి పడుతుంది సిపిఎం హెచ్చరిస్తోంది.

# ఎన్నికల హామీలు అందించటం తో ప్రజల్లో వెల్లివిరుస్తున్న ఆనందం!!

## జగనన్న కాలనీ భూముల కొనుగోలుపై దర్యాప్తు?



రేటు బారెడు స్థలం మూరెడు వున్న జగనన్న కాలనీ

**విజయవాడ, (ఆర్ఎన్ఐ):** ఎన్నికల ముందు కూటమి నుండి కురిపించిన హామీలు ముఖ్యంగా వృద్ధాప్య సామాజిక పెన్షన్లు పెంచిన వాటితో పాటు మూడు నేలల బకాయిలు, ఉద్యోగులకు జీతాలు,రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు మొదటి తేదీన అందించటంతో ఆయావర్గాలు ఆనందోత్సాహంతో ఉన్నాయి.ఇలా మొదటి తేదీన జీతం, పెన్షన్ అందుకుని నాలుగున్నర ఏళ్ళు దాటిందని ఉద్యోగులు, పెన్షనర్లు పేర్కొన్నారు.

అటుపాలన గాడి తప్పకుండాను, ఇటు సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు రాకుండా రెండు విధాలా చూడగలిగే ప్రజ్ఞా పాటవాలు కలిగిన "సవ్యసాచి" ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేత్రుత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలకూడా గడవక ముందే- గడచిన ఐదు ఏళ్లలో గాడి తప్పిన పరిపాలనను చక్కదిద్దే పనిలో వెంటనే నిమగ్నం అయిందని ఆ వర్గాలు తెలుపుతున్నాయి.ఇప్పటికే సామాన్యుడికి అందనంత రేటు పెరిగిన ఇసుక వలన సామాన్యులు గృహనిర్మాణం చెయ్యటం కష్టంగా మారింది. అయితే ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేత్రుత్వంలోని కూటమి ప్రభుత్వం టన్ను ఇసుక కేవలం 88 సీనరేజి గా నిర్ణయించి (ట్రాన్స్పోర్ట్ అదనం) నిర్ణయించటంతో గృహనిర్మాణ పనులు పెరిగి నిర్మాణ రంగ కార్మికులకు పనులు విరివిగా దొరికే అవకాశాలు పెరుగుతాయి.ఇప్పటివరకూ టన్ను ఇసుక వేలల్లో కి చేరటంతో నిర్మాణరంగం దారుణంగా దెబ్బతిని కార్మికులకు ఉపాధికి విఘాతం కలిగింపై. పైగా అడ్డు అదుపు లేకుండా ఇసుకను ఇసుకాసురులు యంత్రాలతో పాతాళం అంత లోతు తీసి ఎక్కడికక్కడా ఎడా పెడ అక్రమంగా అధిక ధరలకు అమ్మకాలు జరిపిన విషయంతో రాష్ట్రంలో ఐదు ఏళ్లుగా నిర్మాణరంగం కుదేలయ్యింది.పైగా నదీ స్వరూపం మారిపోయింది.ప్రస్తుతం ప్రభుత్వం ఇసుకపాలసీ పై తీసుకున్న నిర్ణయంతో ఈరంగం తిరిగి పుంజుకుంటున్నది. దీనికి ట్రాన్స్పోర్ట్ చార్జీలు వాసులు చేస్తే తప్పుపట్టే వారిని ఏమి అనాలో తెలియటంలేదని కూటమి ప్రతినిధి ఒకరు ఆగ్రహించారు.

కాగా వైఎస్సార్ సిపి ప్రభుత్వం షుమారు 51,000 కోట్ల వ్యయంతో 30 లక్షలమందికి జగనన్న కాలనీలపేరుతో స్వంత ఇంటిపథకం కోసం సెంటు స్థలం ఇచ్చేందుకు గాను అడ్డదిడ్డంగా కొన్న భూములు వలన మళ్ళీ పేదలు ఊరికి దూరంగా నెట్టి వేయబడటం, ఇలా చాలీ చాలని స్థలంలో పైగా కొన్ని చోట్ల లోతట్టు, మరికొన్ని చోట్ల స్మశానాశలా ప్రక్కన, కొన్ని వరద కరకట్ల లోపల నివాసయోగ్యంగాని స్థలాలు ఇవ్వటం జరిగింది.ఒక వైపు కేంద్ర ప్రభుత్వం స్లమ్స్ ని నిర్మూలన చేసే కృషి చేస్తుంటే తిరిగి ఇలా సెంటు భూమి ఇచ్చి తిరిగి ఆ గృహాలు ఇచ్చి స్లమ్స్ గా మార్చటం, వూరికి దూరంగా కొని వారిని సామాజక బహిష్కరణ చేసినట్లుగా ఉందని, ఇది దారుణమని అప్పట్లోనే టీడీపీ, జనసేన, ఇతర వామపక్షాల ప్రజాప్రతినిధులు ఆందోళన చెందటం జరిగింది కూడా. పైగా అప్పటి ప్రభుత్వంలో వున్న వారు అనేకులు తక్కువ రేటుకు పొలాలు కొనుగోలు చేసి ప్రభుత్వం నుండి ఎక్కువ రేటు పొంది వందల, వేల కోట్లు అక్రమంగా ఆర్జించారని ఆనాటి ప్రతిపక్షాలు, ఆరోపించటం కూడా జరిగింది కూడా.

ఉదాహరణకు వారు రైతులతో సంప్రదింపులు జరిపి రైతులకి మాట్లాడిన మొత్తం కాక లక్షల్లో మార్జిన్ పెట్టుకుని ప్రభుత్వ ఖజానానికి వందల కోట్లు గండిపెట్టారని కూడా ఆరోపణలున్నాయి.అయితే ప్రభుత్వం రైతులనుండి కొనుగోలుచేసిన పొలాలకు అసలు ఏమాత్రం ఆదాయపు పన్నులేని మొత్తాన్ని నేరుగా రైతుల బాంక్ అకౌంట్లలో వెయ్యటంతో రైతుకు మాట్లాడిన మొత్తం ఉంచి మిగిలిన భారీ మొత్తాలు అకౌంట్ లో పడిన తరువాత డ్రా చెయ్యటం జరిగిందన్న విషయము ఆరాతీస్తే వాస్తవం వెలుగు చూస్తుంది.ఇది ఈ కుంభకోణంపై దర్యాప్తు కు ప్రధాన ఆధారం అని అధికారులు అంటున్నారు. రైతును ఇంతపెద్ద మొత్తం ఎవరికి డ్రా చేసి ఇచ్చారనే దిశలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొంటున్నారు.లేదా భూమి అమ్మిన రైతులు ఒకేసారి ఇంతంత మొత్తాన్ని డ్రా చేసి ఏమి చేశారో చెప్పాలన్న దిశలో విచారణ చేస్తే వివరాలు తప్పక చెప్పాల్సి వస్తుందని కూడా అంటున్నారు.ఇంకా ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులు ,గంజాయి, మాదక ద్రవ్యాల విచ్చలవిడి సరఫరా,నాటి ప్రతిపక్షాలకార్యకర్తలపై దాడులు ,నేతలపైన , వారి ఆస్తులపై దాడులు, దౌర్జన్యాలపై విచారణ తదితర అంశాలతో ప్రభుత్వం ఒక వైపు ఊపిరి సలపనంత పనిలో ఉంటే - మరో వైపు స్థంభించిన పాలనను, అభివృద్ధి కార్యక్రమాలను గాడినపెట్టటం, అప్పుల ఊబినుండి రాష్ట్రాన్ని ఒడ్డెక్కించటం, సంక్షేమ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగించటం లాంటి పనులతో రాష్ట్ర ప్రభుత్వముపై రెండు గురుతర భాధ్యతలున్నాయి. ఈ రెండు సమాంతరంగా తీసుకు వెళ్ళగలిగే పరిపాలన దక్షత కలిగిన "సవ్యసాచి " ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తో పాటు ఉప్ ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్, ఇతర సమర్థులైన మంత్రులపై ఉందని కూటమి నేతలు పేర్కొన్నున్నారు.



మొదలైన ఉచిత ఇసుక విధానము

# సినిమా



## రామ్, రవితేజ ఈ సారి పోటీలో విజేత ఎవరో?





రామ్ పోతినేని, మాస్ మహారాజ్ రవితేజ ఇద్దరికి కూడా టాలీవుడ్‌లో మంచి ఎనర్జిటిక్ హీరోలుగా పేరుంది. ఏ సినిమా చేసిన వారి హై ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంటారు. టైర్ 2 హీరోలుగా ఉన్న వీరిద్దరికి ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఇంచుమించు ఒకేలా ఉంటుంది. రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో డబుల్ ఇస్మార్ట్‌తో ప్రేక్షకుల ముందుకి రాబోతున్నాడు. మాస్ మహారాజ్ రవితేజ హరీష్ శంకర్ దర్శకత్వంలో మిస్టర్ బచ్చన్ మూవీ చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ మేగ్జిమమ్ అయిపోయినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఊహించని విధంగా ఈ రెండు సినిమాలు ఒకే డేట్ కి రిలీజ్ కాబోతున్నాయి. డబుల్ ఇస్మార్ట్ మూవీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా ఐదు భాషలలో రిలీజ్ అవుతోంది. రామ్ కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో ఈ చిత్రం తెరకెక్కింది. ఇస్మార్ట్ శంకర్ లాంటి హిట్ మూవీకి సీక్వెల్ గా వస్తుండటంతో డబుల్ ఇస్మార్ట్ పై చాలా హెూప్స్ ఉన్నాయి. ఆగష్టు 15న ఈ మూవీ రిలీజ్ కాబోతోంది. అదే డేట్ కి రవితేజ మిస్టర్ బచ్చన్ మూవీ థియేటర్స్ లో సందడి చేయబోతోంది. హిందీ హిట్ మూవీ రైడ్ కి రీమేక్ గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇదిలా ఉంటే రామ్, రవితేజ గతంలో ఓ సారి బాక్సాఫీస్ దగ్గర పోటీ పడ్డారు. 2021లో రామ్ రెడ్ మూవీతో సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొచ్చాడు. రవితేజ క్రాక్ మూవీ అదే డేట్ కి రిలీజ్ అయ్యింది. ఈ పోటీలో బాక్సాఫీస్ విన్నర్ గా రవితేజ నిలిచాడు. క్రాక్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. రామ్ రెడ్ మూవీ కమర్షియల్ గా బ్రేక్ ఈవెన్ కలెక్షన్స్ తో సరిపెట్టుకుంది. రెడ్ మూవీ తమిళ్ హిట్ మూవీ రీమేక్ గా తెరకెక్కింది. అయితే ఈ సారి రామ్ స్ట్రైట్ కథతో డబుల్ ఇస్మార్ట్ మూవీ ద్వారా ప్రేక్షకుల ముందుకి రాబోతున్నాడు. రవితేజ రీమేక్ స్టోరీతో పలకరించబోతున్నాడు. హరీష్ శంకర్, పూరీ జగన్నాథ్ ఇద్దరికి కమర్షియల్ డైరెక్టర్స్ గా మంచి పేరుంది. తమదైన శైలిలో కథలని ప్రేక్షకులకి కనెక్ట్ చేస్తారు. మరి ఈ సారి బాక్సాఫీస్ దగ్గర రామ్, రవితేజలో ఎవరు విన్నర్ గా నిలుస్తారనేది ఆసక్తికరంగా మారింది.

## బిగ్ బాస్ మోనాల్.. బ్లాస్టింగ్ లుక్!



బిగ్ బాస్ బ్యూటీ మోనాల్ గజ్జర్‌కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. అల్లరి నరేష్ సుడిగాడు మూవీతో టాలీవుడ్ కు పరిచయమైంది ఈ అమ్మడు. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. కానీ సినిమాల కన్నా బిగ్ బాస్ షోతో తెలుగులో మంచి గుర్తింపు సంపాదించుకుంది. బిగ్ బాస్-4 సీజన్ లో తన ఆటతో అందరినీ ఆకట్టుకుంది. గ్లామరస్ గా కనిపిస్తూ కుర్రాళ్ల మనసులు దోచేసింది. యూత్ లో ఫుల్ ఫాలోయింగ్ దక్కించుకుంది ఈ బ్యూటీ. దీంతో ఆమెకు తెలుగు సినిమాల్లో మంచి అవకాశాలు వస్తాయని అంతా అనుకున్నారు కానీ అలా జరగలేదు. ప్రస్తుతం బుల్లితెరపై సందడి చేస్తోంది బ్యూటీ. పలు డ్యాన్స్ షోలకు జడ్జిగా వ్యవహరిస్తోంది. దాంతోపాటు వరుస గుజరాతీ సినిమాల్లో నటిస్తోంది. యాక్ట్రెస్ గా రానిస్తోంది. సోషల్ మీడియాలో కూడా ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది అమ్మడు. హీట్ పుట్టించే పిక్స్ కు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది. గ్లామర్ గేట్లు ఎత్తేసి అందాలు ఆరబోస్తుంటోంది. తాజాగా కొత్త పిక్స్ షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది మోనాల్. పర్పుల్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో ఫోటో షూట్ పోస్ట్ చేసింది. అందులో సింపుల్ మేకప్ తో మోనాల్ అదిరిపోయింది. క్రేజీ నెక్ సెట్ ఆమె అందాన్ని మరింత పెంచింది. ముఖ్యంగా ఎద అందాలతో కవ్విస్తోంది. సిడ్నీ ఒపెరా హౌస్‌లో ఐదో అంతర్జాతీయ గుజరాతీ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగినట్లు తెలిపింది మోనాల్. ప్రస్తుతం ఆమె కొత్త పిక్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అయితే నయా ఫోటోల్లో మోనాల్ గజ్జర్ సూపర్బ్ గా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అందానికి పర్యాయ పదమని చెబుతున్నారు. బ్లాస్టింగ్ అందాలకు క్లీన్ బౌల్డ్ అయ్యామని అంటున్నారు. లైకులు కొడుతూ నెటిజన్లు.. కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. అయితే అహ్మదాబాద్ కు చెందిన మోనాల్.. స్థానిక ING వైశ్యా బ్యాంకులో అవుట్ సోర్స్ లో జాబ్ చేసింది. ఆ సమయంలో తీసుకున్న ఒక్క నిర్ణయంతో ఆమె లైఫ్ టర్న్ అయింది. 2011లో రేడియో మిర్చి నిర్వహించిన మిర్చి క్వీన్ బీ అందాల పోటీలో పార్టిసిపేట్ చేసి కిరీటాన్ని దక్కించుకుంది మోనాల్. ఆ తర్వాత మిస్ గుజరాత్ అందాల పోటీలో కూడా పాల్గొంది. తన అందం, టాలెంట్ తో టైటిల్ ను కైవసం చేసుకుంది. అలా ఉద్యోగం మానేసి మోడల్ గా కెరీర్ స్టార్ట్ చేసిన మోనాల్.. 2012లో తెలుగు సినిమాతోనే సినీ ఇండస్ట్రీకి పరిచయం అయింది. మళ్లీ మోనాల్ గజ్జర్.. టాలీవుడ్ లో ఎప్పుడు సందడి చేస్తుందో వేచి చూడాలి.

## రాజాసాబ్.. లీక్ అలెర్ట్



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ గా ఎవ్వరికి అందనంత ఎత్తులో ఉన్నాడు. అతనితో సినిమా చేయాలంటే నిర్మాతలు 300ం కోట్లకి పైగా బడ్జెట్ రెడీ చేసుకోవాల్సిందే. అలాగే దర్శకులు లార్జర్ దెన్ లైఫ్ లాంటి కథలని సిద్ధం చేసుకొని చెప్పాల్సి ఉంటుంది. అయిన కూడా వెంటనే డేట్స్ దొరుకుతాయని గ్యారెంటీ లేదు. కనీసం మూడేళ్లు అయన ప్రభాస్ తో మూవీ చేయాలంటే వెయిటింగ్ లిస్ట్ లో ఉండాల్సిందే. ఇండియన్ బాక్సాఫీస్ హిస్టరీలో ఇప్పటి వరకు ఏ హీరోకి కూడా ఈ రేంజ్ ఇమేజ్, మార్కెట్ దొరకలేదు. స్టార్ హీరోలు అయిన కూడా కేవలం ఒక్క భాషకి మాత్రమే పరిమితం అయిపోయారు. అయితే బాహుబలి తర్వాత ప్రభాస్ అన్ని భాషలకి చెందిన హీరోగా మారిపోయాడు. ఆయనతో పోటీగా సినిమా రిలీజ్ చేయాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకునే పరిస్థితి మిగిలిన స్టార్స్‌కి వచ్చేసింది. షారుఖ్ ఖాన్ లాంటి బాలీవుడ్ స్టార్ సలార్ తో పోటీ పడి నిలబడలేకపోయారు. తాజాగా కల్కి 2898 ఏడీతో ప్రభాస్ మరో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం ఆయన లైన్ అప్ లో సలార్ పార్ట్ 2, స్పిరిట్ , హను రాఘవపూడి మూవీ, రాజాసాబ్ సినిమాలు ఉన్నాయి. వీటిలో రాజాసాబ్ షూటింగ్ సగానికి పైగా కంప్లీట్ అయ్యింది. వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ చేయాలనే టార్గెట్ తో తెరకెక్కిస్తున్నారు. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైన్మెంట్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇదిలా ఉంటే రాజాసాబ్ నుంచి ఫోటోలు లీక్ అయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కొన్ని పిక్సని వైరల్ చేస్తూ రాజాసాబ్ సినిమాలో స్టిల్స్ అంటూ ట్రెండ్ చేస్తున్నారు. అయితే ఈ మూవీ నుంచి ఎలాంటి ఫోటోలు లీక్ కాలేదంట. అలాగే సినిమాలో ప్రభాస్ క్యారెక్టర్ పేరు జై సింగ్ ఆజాద్ అంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పంజాబీ గెటప్ లో ఉన్న ప్రభాస్ ఫోటోని రాజాసాబ్ మూవీ స్టిల్ అంటూ వైరల్ చేస్తున్నారు. జై సింగ్ ఆజాద్ అనే పేరు కూడా ఇంకా ఖరారు కాలేదంట. నిజానికి ఆ స్టిల్ కల్కి మూవీ ప్రమోషన్ సాంగ్ కోసం తీసుకున్నదని తెలుస్తోంది. అదే ఫోటోని రాజాసాబ్ పిక్స్ అంటూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. మూవీ అఫీషియల్ అప్డేట్ వచ్చే వరకు ఇలాంటి రూమర్స్ ని నమ్మొద్దని చిత్ర యూనిట్ కూడా ఫ్యాన్స్ కి విన్నవిస్తోంది.

## మహేష్ డబుల్... రాజమౌళి అంత రిస్క్ చేస్తాడా?



టాలీవుడ్ జక్కన్న రాజమౌళి ఆర్‌ఆర్‌ఆర్ సినిమా తర్వాత చేయబోతున్న సినిమా పై దేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇండియన్ సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి నెకొంది. ఇప్పటికే మహేష్ బాబుతో సినిమా కు రాజమౌళి వర్క్ మొదలు పెట్టారు. ఈ ఏడాదిలోనే సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఈ సినిమా గురించి సోషల్ మీడియాతో పాటు ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ సినిమా గురించి రోజుకు ఒక వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇటీవల తమిళ స్టార్ హీరో విక్రమ్ ఈ సినిమాలో నటించబోతున్నాడు అనే వార్తలు వచ్చాయి. ఆ విషయమై చిత్ర యూనిట్ సభ్యుల నుంచి ఎలాంటి క్లారిటీ రాలేదు. ఇప్పుడు మహేష్ బాబును డబుల్ రోల్ లో రాజమౌళి చూపించేందుకు కథను రెడీ చేశాడు అంటూ వార్తలు వస్తున్నాయి. చాలా ఏళ్ల క్రితం విక్రమార్కుడు సినిమాలో రవితేజను డబుల్ రోల్‌లో రాజమౌళి చూపించాడు. ఆ తర్వాత బాహుబలిలో ప్రభాస్‌ను రెండు పాత్రల్లో చూపించాడు. మళ్లీ ఇప్పుడు మహేష్ బాబు సినిమాతో ఆ రిస్క్ చేయబోతున్నాడు అనే వార్తలు వస్తున్నాయి. డబుల్ రోల్ అంటే కచ్చితంగా రిస్క్ ఉంటుంది. హీరో పోషించే రెండు పాత్రలకు సాధ్యం అయినంత ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో ఇతర నటీనటుల విషయంలో తక్కువ చూపించకూడదు. అందుకే డబుల్ రోల్ సినిమాలు దర్శకులకు చాలా రిస్క్ అనే అభిప్రాయం ఉంది. ఫారిన్ మేకోవర్ ఆర్టిస్టులను రప్పించిన రాజమౌళి ఇప్పటికే పలు గెటప్స్ ను రెడీ చేయించారు. మహేష్ బాబు పై లుక్స్ టెస్ట్‌కి రాజమౌళి రెడీ అవుతున్నాడు అనే సమాచారం అందుతోంది. ఇటీవల మహేష్ బాబు గడ్డం పెంచుకుని కనిపించాడు.

గతంలో మాదిరి కాకుండా కచ్చితంగా విభిన్న లుక్‌లో కనిపించబోతున్నాడు. వచ్చే నెలలో సినిమా నుంచి ఫస్ట్ లుక్ వస్తుందని అంతా భావిస్తున్నారు. ఇదే సమయంలో సినిమా గురించి మీడియాలో జరుగుతున్న పలు ప్రచారాలు, షికార్లు చేస్తున్న పుకార్ల గురించి కూడా క్లారిటీ ఇచ్చే విధంగా ఏమైనా ప్లాన్ చేయండి అంటూ ఫ్యాన్స్ రాజమౌళికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## సాయి పల్లవి వాళ్ల కోసం వెయిటింగ్ బాస్!



నేచురల్ పెర్ఫార్మర్ సాయిపల్లవి ఎంతటి ప్రతిభావంతురాలన్నది చెప్పాల్సిన పనిలేదు. కటౌట్ కాకపోయినా తనలో ఉన్న కంటెంట్ తో రాణిస్తోన్న నటి. అందుకే ఎంత మంది కొత్త భామలొచ్చినా ఆమెకి పోటీ కాదనే చెప్పాలి. నెంబవర్ వన్ రేసులో ఎంతమంది హీరోయిన్లు ఉన్నా! సాయి పల్లవికంటూ ప్రత్యేక మైన ట్రాక్ వేసుకుని ముందు కెళుతోంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుంది. డీసెంట్ పాత్రలే పోషిస్తుంది. అందులోనూ నటనకు ఆస్కారం ఉండాలి. ఇలా తనకంటూ కొన్ని నియమ నిబంధనలున్నాయి. అందుకు తగ్గ అవకాశాలే అమ్మడు అందుకుంటుంది. తాజాగా సాయి పల్లవి పోషించా లనుకుంటోన్న పాత్రల గురించి స్పందించింది. ఇప్పటివరకూ కథా ప్రాధాన్యమున్న చిత్రాలు, పాత్రలే చేసాను. అవన్నీ నాకు నాలో ఉన్న డాన్సు ట్యాలెంట్ పరంగానూ మంచి గుర్తింపును తీసుకొచ్చాయి. కానీ వీటికి భిన్నమైన పాత్రలు పోషించాలని ఉంది. మంచి కామెడీ నేపథ్యమున్న సినిమాలు చేయాలని ఉంది. అందులోనూ దర్శకులు నాతో కామెడీ పండించగలగాలి. ఇంతవరకూ అలాంటి పాత్రలు పోషించే అవకాశం రాలేదు. ఇకపై వస్తే మాత్రం కాదనకుండా చేస్తాను. నటిగా అన్ని రకాల పాత్రలు పోషించి నప్పుడే సంపూర్ణ నటిగా రిటైర్ అవ్వగలం. చేసిన పాత్రలే మళ్లీ మళ్లీ చేస్తే బోరింగ్‌గా ఉంటుంది.

ఇకపై పాత్రల పరంగా మరింత సెలక్టివ్‌గా ఉంటాను అని తెలిపింది. ప్రస్తుతం సాయిపల్లవి ఫుల్ బిజీగా ఉంది. నాగ చైతన్యతో తండేల్ సినిమాలో నటి స్తోంది. ఇది పాన్ ఇండియా చిత్రం. ఆమరన్ అనే తమిళ సినిమా చేస్తోంది. వీటితో పాటు బాలీవుడ్ లో లాంచ్ అవుతోంది. ప్రతిష్టాత్మక రామయణ్ సినిమాలో రణబీర్ కపూర్ సరసన నటిస్తోంది. మరో అన్ టైటిల్డ్ ప్రాజెక్ట్ లోనూ నటిస్తుంది.

# భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేద్దాం



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేద్దాం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. ఈ మేరకు బుధవారం సింహాచలం దరి సింహపురి లే అవుట్ - 2 లో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ అందజేసిన దేవతా వృక్షాల మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కనీసం పది మొక్కలు నాటి పెంచాలని కోరారు. శీతోష్ణస్థితి వేడెక్కిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అధికంగా మొక్కలు నాటి పెంచాలని అన్నారు. కాంక్రీట్ జంగిల్ గా మారిన విశాఖపట్నం నగరంలో విరివిగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. సమస్త జీవరాశినీ కాపాడుకుందాం, పర్యావరణ హితంగా జీవించుదాం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పోర్ట్ విశ్రాంత ఇంజినీర్ జనార్ధన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యంగా భావించాలి అని అన్నారు. ప్రస్తుతం వేడి గాలులల వల్ల కలిగుతున్న నష్టాలు దృష్టిలోకి తీసుకుని అత్యధికంగా మొక్కలు నాటి పెంచాలని కోరారు.

అడ్వకేట్ సూర్య నారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లల చేత మొక్కలు నాటి పెంచే విధంగా కృషి చెయ్యాలి అన్నారు. వాళ్ళు అలా అలవాటు చేసుకుంటే భవిష్యత్తు తరాలు హాయిగా జీవించగలుగు తారన్నారు.

గృహిణి లక్ష్మి మాట్లాడుతూ, ఎవరి ఇంటి వద్ద వాళ్ళు ప్రకృతి ఆధారిత పంటలు పండించు కోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడటం అనారోగ్యకరం అన్నారు.

ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె. శ్రీనివాసరావు, గోపాల్, రమేష్ రెడ్డి, హరిదాసు, ప్రకాష్ తదితరులు మాట్లాడారు.

# సింహాద్రి నాథుడు మహిమాన్వితుడు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రపంచంలోనే వరాహ, నారసింహ రెండు అవతారాల కలయిక సింహాచలం శ్రీ వరహా లక్ష్మీ నృసింహ స్వామి ప్రత్యేకతని, అటువంటి స్వామి అత్యంత మహిమాన్వితుడని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. బుధవారం విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు గవర్నర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ హరిబాబు సింహాచలం ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్రసాద్ స్కీం పథకంతో పాటు పలు అంశాలను శ్రీను భాబును అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రసాద్ స్కీంతో సింహగిరి మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆయన అకాంక్షించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు సింహాద్రినాథుడు శేష వస్త్రం తో సత్కరించి జ్ఞాపిక ప్రసాదాలుఅందచేసారు.. బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం. నాగేంద్ర, నగర అధ్యక్షులు మేడపాటి రవీంద్ర రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు..

# నరసింహస్వామి అవతారంలో శ్రీ జగన్నాథుడు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గూడ్స్ రోడ్ వద్ద ఉన్న ఇంద్ర జ్యు మ్న హాలు వద్ద కొలువైన సుభద్రా బలబద్ర సమేత జగన్నాథ స్వామి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బుధవారం భక్తులకు నరసింహస్వామి అవతారంలో దర్శనమిచ్చారు. స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు ఆలయ చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి నరసింహ స్వామి అవతారంలో ఉన్న స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ్ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి( వైభవ్), ఆలయ ఈవో రాజా సులోచన, ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ,డైరెక్టర్లు. బొండా రమేష్, అనకాపల్లి మోహన్ రావు, బోడ్డేడ వెంకట చలపతిరావు, కాండ్రేగుల వెంకట వీర అప్పారావు, బుగత కోటేశ్వరరావు, యల్లమల్లి ధనలక్ష్మి, బుద్ధ లక్ష్మి అప్పారావు, శరగడం కృష్ణ , భక్తులు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య వాగ్దేవి వరదాయిని బృందం నిర్వహించిన అన్నమయ్య కీర్తనల కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# కూటమి ప్రభుత్వం వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ని జిల్లా తెలుగుదేశం పార్టీ విభాగం అధ్యక్షులు కసిడి అర్జున్ స్థానిక జనసేన కార్యాలయంలో బుధవారం కలిసి వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 3000 రూపాయల పెన్షన్ ను 6000 కు పెంచినందుకు నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కళ్యాణులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే వికలాంగులకి ఉచితంగా ఇల్లు మంజూరు చేయాలని కరెంటు ఉచిత నీరు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కనుమ రెడ్డి గోవిందా కటారి శీను జనసాని పార్టీ ఎరుకవానిపాలెం అధ్యక్షులు గొలవెల్లి గోవింద తరుణ్ పాల్గొన్నారు

# జగన్మోహన్ రెడ్డి హయాంలో మైనారిటీ సంక్షేమ నిధుల గోల్మాల్

## బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో మైనారిటీ ల సంక్షేమ నిదులు గోల్ మాల్ చేశారని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక అన్నారు, పాడేరు లో బుధవారం పత్రికల కు విడుదల చేసిన ప్రకటన లో రాష్ట్రంలో దొంగలుగా మారిన అంజాద్ భాష జగన్మోహన్ రెడ్డి 4000 కోట్ల రూపాయలు సుమారు నిధుల కైకరియం పక్కదారి పట్టించడం అదేవిధంగా వాటిని మాయం చేయటం ఈ సందర్భంగా కేంద్రం నుంచి వచ్చి నటువంటి 16,000 కోట్ల రూపాయల యొక్క లెక్కలు చూపిస్తూ రాష్ట్రం ఖర్చుపెట్టిన కేవలం 11 వేల కోట్ల రూపాయల యొక్క లెక్కల సంబంధించినటువంటి వివరాలు తెలుపుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి 24 మధ్యలో చేసినటువంటి మైనారిటీ యొక్క ద్రోహాన్ని మైనార్టీ మోర్చా బహిరంగబలిచింది.

2.తక్షణమే అంజాద్బాషాని అరెస్టు చేసి పోలీసు పద్ధతిలో విచారించి ఎక్కడ ఎంత నిధులు నొక్కేశారో లెక్కలు తీసి శ్వేతపత్రం ప్రకటించాలి.

3. సిట్ యొక్క దర్యాప్తుతో మైనార్టీ సంక్షేమ శాఖలో అవినీతిని బయట పెట్టాలి.

4. మోసపు మాటలతో మైనారిటీ వర్గాలని మోసం చేసిన మైనారిటీలు అమాయకులు కాదని వారికి ఉన్నటువంటి జ్ఞానముతో వాళ్ల మీద ఏ ప్రభుత్వం అయితే వారిని బాధించిందో ఆ ప్రభుత్వాన్ని శిక్షించారు కమలం పువ్వు గుర్తుపై ఓట్లు వేసి మైనారిటీ సమాజం నరేంద్ర మోడీ గారి యొక్క సబ్కా సాథ్, సబ్కా వికాస్ ,సబ్కా ప్రయాస్ అనేటువంటి నినాదానికి బలోపేతం చేశారు.

5.ఎన్డీఏ కూటమి యొక్క విజయం మైనారిటీలు తమ విజయం గా తీసుకొని గెలిపించి చూపించారు దాని ఫలితంగానే వచ్చినటువంటి ఈ యొక్క అధికార మార్పిడి రాష్ట్రంలో ప్రజలు ఇచ్చినటువంటి తీర్పు గత పాలకులు చేసినటువంటి కుంభ కోణాలపై దర్యాప్తు చేసి తక్షణ అరెస్టుల కోసం అనే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు గుర్తించాలని పని మైనారిటీ మోర్చా విజ్ఞప్తి చేస్తూ మైనారిటీ శాఖలో జరిగిన అవినీతి తక్షణమే చేయాలని మైనార్టీ మైనార్టీ మోర్చా విజ్ఞప్తి చేస్తా ఉంది అని అన్నారు.

# జనాభా పరిశోధన కేంద్రాలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారత ప్రభుత్వం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలో 18 జనాభా పరిశోధన కేంద్రాలు స్థాపించడం జరిగింది. వీటిలో 1956 ఢిల్లీ లో స్థాపించిన జనాభా పరిశోధన కేంద్రం మొట్టమొదటి కాగా 1989 సాగర్ (మధ్యప్రదేశ్) లో స్థాపించిన జనాభా పరిశోధన కేంద్రం ఆఖరిది. ఈ క్రమంలో 1977 వ సంవత్సరంలో నాలుగవదిగా విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ లో జనాభా పరిశోధన కేంద్రం స్థాపించడం జరిగింది.

సాధారణంగా కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన టువంటి అనేక ఆరోగ్య కార్యక్రమాలు వివిధ రాష్ట్రాలలో ఏ విధంగా అమలవుతున్నాయో వాటిని పరిశీలించడం మరియు ఈ ఆరోగ్య కార్యక్రమాలు పనితీరుకు సంబంధించి పరిశోధన చేయడం తద్వారా వివిధ ఆరోగ్య పథకాలు, కార్యక్రమాలలో ఎటువంటి మార్పుల అవసరం, మెరుగుదల అవసరమో పరిశీలన, పరిశోదన చేసి, ఈపరిశోధన ఫలితాలు ఆయా రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలకు అందజేయడం జరుగుతుంది. తద్వారా ఆయా రాష్ట్రా, కేంద్ర ప్రభుత్వాలు వీటి అమలులో అనేక మార్పుల-చేర్పులు చేస్తూ ప్రజల అవసరాలు అనుగుణంగా మరికొన్ని కొత్త పథకాలు రూపకల్పన చేయడంలో ఈ జనాభా పరిశోధన కేంద్రాలు సహకరిస్తాయి. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను అనుసరించి క్షేత్ర స్థాయిలో ఉన్నటువంటి ఆరోగ్య ఉప కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) స్థాయి నుంచి జిల్లా స్థాయిలో ఉన్నటువంటి జిల్లా ఆసుపత్రి (డిస్ట్రిక్ట్ హాస్పటల్) స్థాయి వరకు వివిధ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలలోని ఆసుపత్రులు పరిశీలించి వాటి నివేదికను కూడా కేంద్ర ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుంది.

**డిజిటల్ పాపులేషన్ క్లాక్:**

వాస్తవానికి జనాభా లెక్కలకు, జనాభా పరిశోధన కేంద్రాలకు ఎటువంటి ప్రత్యక్ష సంబంధం లేదు. ఈ జనాభా లెక్కలు మరియు సెన్సెస్ తదితర అంశాలు కేంద్ర ప్రభుత్వ స్టాటస్టిక్స్ మరియు ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ వారు అదే విధంగా రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్-సెన్సెస్ ఆపరేషన్ విభాగం వారు వీటిలో ప్రత్యక్షంగా భాగస్వాములు అవుతారు. అయినప్పటికీ ఈ జనాభా పరిశోధన కేంద్రాలు చేస్తున్నటువంటి పని ప్రజలు ఆరోగ్య కార్యక్రమాలు, వాటి అమలు తీరుకు సంబంధించింది కాబట్టి ఈ జనాభా పరిశోధన కేంద్రాలు ఉన్నటువంటి ప్రాంతాలలో జనాభా పెరుగుదలపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్య పరచడంలో దోహదపడే విధంగా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి 18 జనాభా పరిశోధన కేంద్రాలు వద్ద ఈ డిజిటల్ పాపులేషన్ క్లాకులు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్లాకు ద్వారా దేశ జనాభా మరియు ఆ రాష్ట్ర జనాభా రియల్ టైం ఆధారంగా ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా ప్రసారమవుతాయి.

ముంబైలో ఉన్నటువంటి ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ వారి మోడల్ ను అనుసరించి దేశ జనాభా తో పాటుగా ఆయా రాష్ట్రాలలో ఉన్నటువంటి డైరెక్టర్-సెన్సెస్ ఆపరేషన్ విభాగం వారి లెక్కలకు అనుసరించి ఒక నిర్ణీతమైన తేదీ నాటికి ఉన్నటువంటి జనాభాను ప్రామాణికంగా తీసుకొని అప్పటి నుంచి జనాభా పెరుగుదల (గ్రోత్ రేట్) ఆధారంగా ఒక ప్రోగ్రాం డిజైన్ చేసి, ఆ చిప్ ను ఈ డిజిటల్ పాపులేషన్ క్లాక్ లో అమర్చడం జరుగుతుంది. తదానుగుణంగా ఈ జనాభా పెరుగుదల రియల్ టైం ఆధారంగా ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసరితమవుతాయి. భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వారు దేశవ్యాప్తంగా ఉన్నటువంటి 18 జనాభా పరిశోధన కేంద్రాల వద్ద ఈ విధంగానే వీటిని అమరచడం జరిగింది.

**ప్రపంచ జనాభా దినోత్సవం:**

ఈ క్రమంలోనే ప్రతి ఏడాది యుఎన్ఓ మార్గదర్శకాలుకు అనుగుణంగా భారతదేశ వ్యాప్తంగా అన్ని జనాభా పరిశోధన కేంద్రాలలో జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది. దీనిలో భాగంగా ఆయా ప్రాంతాలలో ఉన్నటువంటి కళాశాల విద్యార్థులకు జనాభా పెరుగుదలపై అవగాహన కల్పించే విధంగా వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి వారిలో ఈ జనాభా పెరుగుదలపై పూర్తిస్థాయిలో చైతన్యపరిచి, జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆయా ప్రభుత్వాలు తీసుకోవలసిన టువంటి చర్యలు మొదలగు అంశాలపై అవగాహనపరచడం జరుగుతుంది.




శ్రీ గురుభ్యోనమః

సద్గురువులు బ్ర॥శ్రీ॥ సుసరాపు దుర్గా ప్రసాదశర్మ గారి ఆశీస్సులతో

వందే గురు పదద్వందఅవాఙ్మానస గోచరం

రక్త శుక్ల ప్రభామిశ్ర మతర్క్యం త్రైపురం మహః

శ్లో॥ భజే శ్రీచక్ర రాజస్థాం॥ దక్షిణోత్తరయో సదా॥

శ్యామా వార్తాళీ సంసేవ్యాం॥ లలితాంబాం చతుర్భుజాం॥



**శ్రీ రాజరాజేశ్వరీ దేవీ పీఠం**

సాండి వీధి, చాపర గ్రామం, మెళియాపుట్టి మండలం, శ్రీకాకుళం జిల్లా - 532216

**తేది 21-07-2024 ఆదివారం**

**శ్రీ గురు పౌర్ణమీ (వ్యాస పౌర్ణమీ)**

ఆహ్వానము

మహాశయులారా!

మన భారతీయ సంప్రదాయ ప్రవర్తకులు, సర్వ పురాణేతిహాస వేద వాఙ్మయకర్తలు జ్ఞానదాతలు, బ్రహ్మవేత్తలు వేదవ్యాస, వాల్మీకి, దత్తాత్రేయ, శంకరాచార్య, కాళిదాసాది మన గురుదేవుల వరకు - ఉన్న గురువులను సంస్మరించుట మన కర్తవ్యము మరియు యీ దినం స్వగురువులకు, గురుతుల్యులగువారికి, తాంబూల ఫల వస్త్ర దక్షిణలతో సంతోషపెట్టి, వారు ఇచ్చిన జ్ఞానబోధను ఆశీస్సులను పొందగోరు చున్నాము.

**కార్యక్రమం**

స్వస్తిశ్రీ చాంద్రమాన క్రోధి నామసంవత్సర ఆషాఢ శుద్ధ పౌర్ణమీ ఆదివారం అనగా తేది 21-07-2024

ఉదయం గం॥8-00ల నుండి మద్యాహ్నం గం॥12-00ల వరకు

**శ్రీ గురు సంస్మరణం: శ్రీ గురుపాదుకా అర్చన, అభిషేకం, హారతి మరియు సమారాధన**

సన్మానాలు-సత్కారాలు:

సన్మాన గ్రహీత:

శ్రీకాకుళం జిల్లా, పాత టెక్కలి గ్రామ వాస్తవ్యులు, నందిగాం గ్రామ పురోహితులు గా పేరుగాంచిన **వేదమూర్తులైన కీ॥శే॥ బ్ర॥శ్రీ॥ రేజేటి వేంకట నరసింహమూర్తి, అమ్మలమ్మ** ల సుపుత్రుడుగా చుట్టు ప్రక్కల పద్దెనిమిది గ్రామాలకు నిత్యము హితము కోరుతూ జ్యోతిష్యంలో ఎం.ఎ., పట్టభద్రుడై, ఇటు ముహూర్తం, పౌరోహిత్యము నందు, చలనచిత్ర, బుల్లితెర (టి.వి.) నటనలోనూ, జాతీయ స్థాయిలో అనేక నాటక పరిషత్తులలో ఎందరినో మెప్పించి అనేక అవార్డులను తన స్వంతం చేసుకున్న ఆదర్శ మూర్తి,

అజాతశత్రువు, బహుముఖ ప్రజ్ఞాశాలి

**వేదమూర్తులైన బ్ర॥శ్రీ రేజేటి నీలకంఠ సత్యనారాయణ మూర్తి శర్మ** (బోసుబాబు) మరియు వారి సతీమణి **శ్రీమతి నాగమణి దంపతులకు** ఆత్మీయ సత్కారము....

**శ్రీ రాజరాజేశ్వరీ దేవీ పీఠంలో**

పరసుఖానందనాథదీక్షానామధేయులు

**బ్రహ్మశ్రీ వనమాలి వేంకటరమణమూర్తి శర్మ మరియు సోదరులు**

శిష్యబృందంచే జరుపుదురు. గాన భక్తులు - ఉపాసకులు - అభిమానులు అందరూ విచ్చేసి శ్రీదేవీ, గురుదేవులను దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించి గురుదేవుల యొక్క ఆశీస్సులు పొందగోరుచున్నాము.

సెల్: 8897341776, 9492141776
9492719122

ఇట్లు
**శ్రీ రాజరాజేశ్వరీ దేవీ పీఠం**
శిష్యబృందం, సాండి వీధి, చాపర.


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.